Follow: @ANNTELUGU
ANN తెలుగు
04-07-2025
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 210 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## భారత్‌లో 2,500 రాజకీయ పార్టీలు ఉన్నాయ్

### మోదీ వ్యాఖ్యలకు ఘనా పార్లమెంట్ ఆశ్చర్యం

**మహా :** భారత దేశం బలంగా ఉంటే మరింత స్థిరమైన, సంపన్నమైన ప్రపంచానికి దోహదపడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రెండు రోజుల ఘనా పర్యటనలో భాగంగా ఆ దేశ పార్లమెంటును ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. భారత్‌లో 2500 రాజకీయ పార్టీలు ఉన్నాయని మోదీ చెప్పగానే పార్లమెంట్‌లోని సభ్యులంతా ఆశ్చర్యంతో నవ్వులు చిందించారు. మళ్లీ చెబుతున్నా అంటూ భారత్‌లో 2,500 రాజకీయ పార్టీలు ఉన్నాయని అన్నారు. నిజమైన ప్రజాస్వామ్యం చర్చను ప్రోత్సహిస్తుందని, అది ప్రజలను ఏకం చేస్తుందని పేర్కొన్నారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**



నన్ను డమ్మీ అన్నవాళ్లకు
**డాడీ అవుతా**
- నా ఉగ్రరూపం చూస్తే తట్టుకోలేరు
- బీజేపీ స్టేట్ చీఫ్ సంచలన వ్యాఖ్యలు

02



బీసీల కోసం కవిత జైల్లో ఉద్యమం చేసిందా?
- పదేళ్ళు అధికారంలో ఉంది మీరే కదా?
- గొర్లు బర్ల పేర్లతో దోచుకుంది బీఆర్ఎస్ కాదా?
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్

02




హాలీవుడ్ లిస్ట్‌లో
**దీపికా పదుకొణె**
- తొలి భారతీయ నటిగా రికార్డ్

08



## రిజర్వేషన్లు తేల్చాకే ఎన్నికలు నిర్వహించాలి
- బీసీ రిజర్వేషన్ల సాధన కోసం జులై 17న రైల్ రోకో
- తెలంగాణ నుంచి ఢిల్లీ వెళ్లే ప్రతి రైలును ఆపుతాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

వివరాలు 2లో



## కల్యాణ్ బాబు నిప్పులు చెరిగాడు
హరిహర వీరమల్లు ట్రైలర్ పై చిరంజీవి రివ్యూ

వివరాలు 2లో



## బనకచర్ల వల్ల ఎవరికీ నష్టం లేదు
- కొందరు అనవసరంగా రాజకీయం చేస్తున్నారు
- వృథా నీళ్లు వాడుకోవాలన్నదే మా ఉద్దేశం
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు

వివరాలు 2లో



## నేడు తెలంగాణకు రాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్, మహా : కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలంగాణకు రానున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో జరిగే స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. అల్లూరి సీతారామరాజు, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో గిరిజన సమాజ హక్కులు మరియు సంక్షేమం కోసం బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరోచిత చరిత్రకు గుర్తుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



# పెట్టుబడులకు కేంద్రంగా హైదరాబాద్



### పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ కల్పిస్తాం
### ఇన్వెస్ట్‌మెంట్లను ఆకర్షించడంలో తెలంగాణ ముందుంది
డిసెంబర్ 9న 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ
రాబోయే వందేళ్లను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధికి ప్రణాళికలు: రేవంత్
మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్‌ను ప్రారంభించిన సీఎం

*రాష్ట్రానికి వచ్చే పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ కల్పించి, వారి వ్యాపారాలు లాభదాయకంగా సాగేలా చూసే బాధ్యత తమదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని, ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాలతో పోటీ పడుతోందని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రాబోయే వందేళ్లను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికలు రచిస్తున్నామని స్పష్టం చేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించారు. అక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కుతో పాటు, 'మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ' తయారీ విభాగాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.* - మహా, హైదరాబాద్

వివరాలు 2లో



# ఖర్గేకు ఘనస్వాగతం

### ముఖ్యమంత్రి రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, పీసీసీ చీఫ్ మహేష్, మీనాక్షిల వెల్కమ్
తాజ్‌లో ముఖ్యనేతలతో భేటీలు.. నేడు 15వేల మంది గ్రామశాఖల కార్యకర్తలతో సమావేశం
ఖర్గేను కలిసిన మంత్రి పదవులు రాని నేతలు.. త్వరలో న్యాయం చేస్తామని హామీ

**హైదరాబాద్, మహా:** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే గురువారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకోగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ ఘనస్వాగతం పలికారు. అక్కడి నుండి తాజ్ కృష్ణకు వెళ్ళిన ఖర్గే పార్టీకి చెందిన ముఖ్యనేతలతో భేటీ అయ్యారు. మంత్రి పదవి ఆశించి దక్కని నేతలతో మాట్లాడారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే భేటీ తో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చీఫ్ విప్ తీసుకోమని సూచించగా, తిరస్కరించి మధ్యలోనే వెళ్ళినట్లు ప్రచారం జరిగింది. తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బయటికి వచ్చి నచ్చజెప్పినట్లు సమాచారం.

మిగతా 2లో

## ఏఐసీసీ చీఫ్ ఖర్గే సమావేశంపై పీసీసీ ఫోకస్
- దేశంలోనే తొలిసారి.. గ్రామస్థాయి క్యాడర్‌తో అధ్యక్షుని భేటీ
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సారథ్యంలో సమావేశం
- మీటింగ్ విజయవంతంపై సీఎం రేవంత్ జూమ్ మీటింగ్
- ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మీనాక్షి నటరాజన్.. ఏఐసీసీ అగ్రనేత సభ ప్రతిష్టాత్మకం

2లో

## సోనియా, రాహుల్‌ను విచారించాలి
### కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ఈడీ
నేషనల్ హెరాల్డ్‌లో రూ. 2 వేల కోట్ల మనీ లాండరింగ్

**ఢిల్లీ, మహా:** నేషనల్ హెరాల్డ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను విచారించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ, ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. యంగ్ ఇండియా కంపెనీ పేరిట అక్రమాలు జరిగాయని.. దాదాపు రూ.2 వేల కోట్ల మనీలాండరింగ్ జరిగిందంటూ ఈడీ అభియోగం మోపింది ఈ కేసులో ఇప్పటికే సోనియా, రాహుల్ సహా తదితరులపై ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అంతేకాదు.. యంగ్ ఇండియన్ సంస్థ ద్వారా అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ఆస్తులను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఈ ఛార్జ్‌షీట్‌లో ఈడీ స్పష్టం చేసింది. దీని నుంచి రూ. 2,000 కోట్ల విలువైన ఆస్తులను అక్రమంగా వారు పొందారని




ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే సోనియా, రాహుల్‌ను విచారించేందుకు అనుమతి ఇవ్వవలసిందిగా ఈడీ అధికారులు కోరారు.



## ఆస్పత్రిలో చేరిన కేసీఆర్
- ఆయన వెంట కేటీఆర్, హరీష్, సంతోష్.. కేసీఆర్ ఆరోగ్యంపై హెల్త్ బులిటెన్ విడుదల
- ఆరోగ్యంపై ఆరా తీసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..
- వైద్యులకు ఫోన్

వివరాలు 2లో

## మీనాక్షి నటరాజన్‌తో కొండా దంపతుల భేటీ
### వరంగల్ గ్రూపు రాజకీయాలపై వివరణ
నేను ఎవరికీ భయపడ.. బీసీ కార్డు పట్టుకునే బతుకుతున్నా
కాంగ్రెస్ నేత కొండా మురళి కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉన్నా తనను రెచ్చగొడుతున్నారని కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. తన సతీమణి, మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన హైదరాబాద్ హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రూప్ రాజకీయ పరిణామాలపై వివరించారు. తాజా పరిణామాలపై 16 పేజీల లేఖ అందించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను మీనాక్షి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పనిచేసే వారిపైనే రాళ్లు విసురుతారని చెప్పారు. నడిచే ఎద్దునే పొడుస్తారన్నారు.

మిగతా 2లో

## మంత్రి జూపల్లి ఆగ్రహం
### విధుల్లో నిర్లక్ష్యంపై కొరడా.. రిమ్స్‌లోని కృష్ణ ఏజెన్సీ కాంట్రాక్టు రద్దు

ఆదిలాబాద్, మహా: మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహంతో రిమ్స్ లో కాంట్రాక్టర్ కు షాక్ తగిలింది. అస్తవ్యస్థ నిర్వహణపై జిల్లా ఇన్ ఛార్జి మంత్రిగా ఉన్న జూపల్లి ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆదిలాబాద్ రిమ్స్ లో కృష్ణ ఏజెన్సీ పై కలెక్టర్ రాజర్షిషా చర్యలకు ఉపక్రమించారు. ఇటీవల కలెక్టర్ రిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన సమయంలో గుర్తించిన సమస్యలపై షోకాజ్ నోటీసు జారీ చేశారు. అయినప్పటికీ కాంట్రాక్టర్ విధులలో నిర్లక్ష్యం వహించడం.. ఇటీవల ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆస్పత్రిని తనిఖీ చేసిన సమయంలో పారిశుధ్య నిర్వహణ లోపంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంచార్జి మంత్రి ఆదేశాల మేరకు రిమ్స్ లో కృష్ణ ఏజెన్సీ కాంట్రాక్టును రద్దు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.



## ఎరువులు అడిగేది రబీ సీజన్‌కు
### ముగిసిన సీజన్ కోసం కాదు
- యూరియా సరఫరాలో రాజకీయం చేయట్లేదు
- సమస్యపై స్పందించిన డీకే అరుణకు థ్యాంక్స్
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



03



## నన్ను డమ్మీ అన్నవాళ్లకు డాడీ అవుతా

### నా ఉగ్రరూపం చూస్తే తట్టుకోలేరు

### బీజేపీ స్టేట్ చీఫ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** తాను డమ్మీ లీడర్‌నా.. కాదా..? అనేది త్వరలో చూపిస్తా అని బిజెపి స్టేట్ చీఫ్ ఎన్. రామచందర్ రావు స్ట్రాంగ్ కామెంట్స్ చేశారు. నన్ను డమ్మీ అన్నవాళ్లకు డాడీ అవుతా అని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్ష పదవి అనేది కిరీటం కాదని.. బాధ్యత అని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ట్విట్టర్ పార్టీ దానితో ఎవరికీ ఉపయోగం లేదని.. మా పోటీ ఎప్పుడూ కాంగ్రెస్‌తోనే అని అన్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల మీద ఫోకస్ పెట్టాం.. వీలైనన్నీ ఎక్కువ సీట్లు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాజాసింగ్ అంశం జాతీయ నాయకత్వం చూసుకుంటుందని చెప్పారు.మొత్తం తెలంగాణలో నా కంటే ఫైర్ బ్రాండ్ ఎవరూ లేరని కీలక వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ జీవితంలో ఇప్పటివరకు 14 సార్లు జైలుకు వెళ్లి వచ్చాను.. లాఠీ దెబ్బలు తిన్నాను, మావోయిస్టులతో పోరాటం చేశానని గుర్తుచేశారు. అందరినీ కలుపుకుపోవాలి అని ఉద్దేశంతోనే కూల్‌గా ఉంటున్నాను.. నా ఉగ్రరూపం చూస్తే తట్టుకోలేరు అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. చొక్కా గుండీలు విప్పి బూతులు మాట్లాడితేనే అగ్రెసివ్ లీడర్ కాదు.. సిద్ధాంతాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లగలిగిన వాడే అసలైన లీడర్ అని అన్నారు. ఆ నమ్మకం, సంకల్పం నాకుంది అని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం మా పార్టీలో ఎలాంటి విభేదాలు లేవు.. అందరం కలిసికట్టుగానే పనిచేస్తాం అని ప్రకటించారు.

# పెట్టుబడులకు కేంద్రంగా హైదరాబాద్



**హైదరాబాద్, మహా:** రాష్ట్రానికి వచ్చే పెట్టుబడిదారులకు పూర్తి రక్షణ కల్పించి, వారి వ్యాపారాలు లాభదాయకంగా సాగేలా చూసే బాధ్యత తమదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని, ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాలతో పోటీ పడుతోందని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రాబోయే వందేళ్లను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికలు రచిస్తున్నామని స్పష్టం చేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించారు. అక్కడ కొత్తగా ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కుతో పాటు, 'మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ' తయారీ విభాగాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.

**విశ్వసనీయ పెట్టుబడి వాతావరణానికి..**

తమ కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికే ఒక 'ఫ్యూచర్ సిటీ'ని అందిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'రానున్న వందేళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 'విజన్2047' ప్రణాళికను రూపొందించామని సీఎం గుర్తు చేశారు. నగర అభివృద్ధి కోసం దేశ, విదేశీ కన్సల్టెంట్లు పని చేస్తున్నారని, అభివృద్ధిలో తెలంగాణ.. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలతో పోటీ పడుతుందని తెలిపారు. తెలంగాణపై నమ్మకంతో భారీ పెట్టుబడులు పెట్టిన మలబార్ గ్రూప్‌కి సీఎం ప్రత్యేక అభినందనలు తెలిపారు. 'మహేశ్వరంలో జ్యువెలరీ తయారీ యూనిట్‌ను ప్రారంభించడమే కాకుండా, స్థానిక అభివృద్ధి, ఉపాధికి ఇది కొత్త దారి చూపుతోందని అన్నారు. ఇది తెలంగాణ రాష్ట్రంలో విశ్వసనీయ పెట్టుబడి వాతావరణానికి నిదర్శనం అని కొనియాడారు.

**ఫోర్త్ సిటీ - భారత్ ఫ్యూచర్ సిటీ..**

మహేశ్వరం ప్రాంతాన్ని పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో 'ఫోర్త్ సిటీ భారత్ ఫ్యూచర్ సిటీ' నిర్మాణాన్ని కూడా ప్రకటించారు. దీని ద్వారా ప్రాంతీయ అభివృద్ధితో పాటు లక్షలాది ఉద్యోగావకాశాలు కలుగుతాయని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా.. వాటి ద్వారా ఆ పెట్టుబడిదారులకు లాభదాయకత కూడా కలగాలి అనే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో తయారీ రంగం 9 శాతానికి పైగా వృద్ధి సాధిస్తోందని వివరించారు. ప్రభుత్వం ఇటీవల గ్రీన్ ఇండస్ట్రియల్, నూతన ఎంఎస్ఎంఈ పాలసీ2025ను ఆమోదించిందని గుర్తుచేశారు. కొత్త పరిశ్రమల ఏర్పాటు కోసం 4,200 దరఖాస్తులు రాగా, వాటిలో 98 శాతం దరఖాస్తులను కేవలం 15 రోజుల్లోనే పరిష్కరించామని చెప్పారు. సింగిల్ విండో విధానం ద్వారా పారదర్శకంగా, వేగంగా అనుమతులు మంజూరు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

## భారత్‌లో 2,500 రాజకీయ పార్టీలు ఉన్నాయ్

### మోదీ వ్యాఖ్యలకు ఘనా పార్లమెంట్ ఆశ్చర్యం

(మొదటిపేజీ తరువాయి)

అలాగే గౌరవానికి మద్దతు ఇస్తుందని, మానవ హక్కులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. 'ప్రజాస్వామ్యం కేవలం ఒక వ్యవస్థ కాదు. అది మా ప్రాథమిక విలువల్లో ఒక భాగం. వివిధ రాష్ట్రాలను 20 విభిన్న పార్టీలు పాలిస్తున్నాయి. 22 అధికారిక భాషలు, వేలాది మాండలికాలు ఉన్నాయి. భారత్‌కు వచ్చిన వారందరినీ మా దేశ ప్రజలు ఆత్మీయంగా స్వాగతించడానికి అదే కారణం. ఇదే స్ఫూర్తి వల్లే భారతీయులు ఎక్కడికి వెళ్లినా సులభంగా కలిసిపోతారు'అని ప్రధాని మోదీ చెప్పారు. ప్రధాని మోదీ ప్రసంగం తర్వాత ఘనా పార్లమెంటే స్పీకర్ అల్బన్ కింగ్స్‌ఫోర్డ్ సుమనా బాగ్బిన్ కూడా మోదీ చెప్పిన 2,500 రాజకీయ పార్టీలు అనే పదాన్ని రిపీట్ చేశారు. మోదీతో సహా పార్లమెంట్‌లో ఉన్న అందరూ మళ్లీ నవ్వారు.

**మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్**

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ప్రపంచానికి బలమైన స్తంభంలాంటిదని మోదీ చెప్పారు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ పాలనలో విశ్వసనీయమైన, ప్రభావవంతమైన సంస్కరణల కోసం పిలుపునిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవం, గ్లోబల్ సౌత్ ఎదుగుదల, మారుతున్న జనాభా, ప్రపంచ వేగం ,స్థాయికి దోహదం చేస్తున్నాయని చెప్పారు. స్థిరమైన రాజకీయ వ్యవస్థ, మంచి పాలన కారణంగా త్వరలోనే భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత ప్రజలు శాంతి, భద్రత, అభివృద్ధిపై తమ విశ్వాసాన్ని తిరిగి ఉంచారని పేర్కొన్నారు.



## ఖర్గేకు ఘనస్వాగతం

### ముఖ్యమంత్రి రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, పీసీసీ చీఫ్ మహేష్, మీనాక్షిల వెల్కమ్

తాజ్‌లో ముఖ్యనేతలతో భేటీలు.. నేడు 15వేల మంది గ్రామశాఖల కార్యకర్తలతో సమావేశం

ఖర్గేను కలిసిన మంత్రి పదవులు రాని నేతలు.. త్వరలో న్యాయం చేస్తామని హామీ

(మొదటిపేజీ తరువాయి)

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎమ్మెల్యేల భేటీలో అభిప్రాయాలను తెలుసుకొని పంపించారు. ఉమ్మడి 10 జిల్లాలకు ఒక్కొక్కరికి మంత్రి ఇవ్వాలని మల్లికార్జున్ ఖర్గే కు సూచించినట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. స్టేట్ పాపులేషన్ లో 46 శాతం రంగారెడ్డి, హైదరాబాద్ నుండి ఉందని, రాబోయే రోజుల్లో పెరిగే సీట్లలో అత్యధికం ఇక్కడే పెరుగుతాయని ఇక్కడ ఖచ్చితంగా పదవి ఇవ్వాలని కోరారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మల్లిఖార్జున్ ఖర్గేని కలిసి మంత్రి పదవి గురించి అడిగామన్నారు. పార్టీలో సీనియర్లకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఖర్గేతో లంబాడా సామాజిక వర్గ ఎమ్మెల్యే బాలు నాయక్ భేటీ కాగా, తమ కమ్యూనిటీకి సరైన ప్రాధాన్యత దక్కలేదని, న్యాయం చేయాలని కోరారు. దీనికి ఖర్గే సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఇంకా మంత్రి వివేక్, ఎమ్మెల్సీ విజయశాంతి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు కీలక నేతలు ఖర్గేను కలిసి రాష్ట్రంలోని పరిస్థితులు వివరించారు.



## బీసీల కోసం కవిత జైల్లో ఉద్యమం చేసిందా?

- పదేళ్ళు అధికారంలో ఉంది మీరే కదా?
- గొర్లు బర్ల పేర్లతో దోచుకుంది బీఆర్ఎస్ కాదా?
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్

**హైదరాబాద్, మహా**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు పీసీసీ చీఫ్ కౌంటర్ ఇచ్చారు. కవిత బీఆర్ఎస్ నాయకురాలిగా ఖర్గేకు లేఖ రాశారా.. లేదా జాగృతి నాయకురాలిగా రాశారా అని ప్రశ్నించారు. గొర్లు, బర్ల పేరుతో దోచుకుంది బీఆర్ఎస్ కదా అంటూ మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు బీసీల గురించి మాట్లాడలేదని నిలదీశారు. బీఆర్ఎస్ పాలనలో ఎంపీగా, ఎమ్మెల్సీగా, జాగృతి నాయకురాలిగా ఉండి ఎక్కడా కూడా మాట్లాడలేదని గుర్తు చేశారు. బీసీల గురించి మాట్లాడే హక్కు కవితకు లేదన్నారు. ఆ రోజు తాము బీసీల గురించి ప్రకటన చేసే సమయంలో కవిత ఎక్కడ ఉన్నారని, లిక్కర్ స్కామ్‌లో అరెస్టై జైల్లో ఉన్నారని చెప్పారు. బీసీల గురించి కవిత జైల్లో ఉద్యమాలు చేశారా.. ఎక్కడ చేశారో మరి తనకు తెలీదన్నారు.

**సవాల్‌కు హరీశ్ సిద్ధమా?..**

బనకచర్లపై రేవంత్ చేసిన సవాల్‌కు మాజీ మంత్రి హరీశ్ రావు సిద్ధమా అంటూ మహేశ్ కుమార్ అని ప్రశ్నించారు. ఆనాడు ఏపీ ప్రభుత్వ నేతలతో చెట్టా పట్టా వేసుకొని తిరిగింది మీరే కదా అని మండిపడ్డారు. ఏపీ మాజీ మంత్రి రోజా ఇంట్లో చేపల పులుసు తిని నీటి వాటా విషయంలో కాంప్రమైజ్ అయింది మీరు కదా అని నిలదీశారు. బనకచర్ల విషయంలో బీఆర్ఎస్ నేతలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. అలాగే రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ నాయకుడి నియమించలేని స్థితిలో రాష్ట్రంలో బీజేపీ ఉండటం విచారకరమన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ మధ్య ఫెఫికాల్ బంధం ఉందని సెటైర్లు వేశారు. మతతత్వ పార్టీతో లౌకిక వాద పార్టీ అయిన కాంగ్రెస్‌కు ఏం సంబంధమన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీ పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు.

## మీనాక్షి నటరాజన్‌తో కొండా దంపతుల భేటీ

### వరంగల్ గ్రూపు రాజకీయాలపై వివరణ

నేను ఎవరికీ భయపడ.. బీసీ కార్డు పట్టుకునే బతుకుతున్నా

కాంగ్రెస్ నేత కొండా మురళి కీలక వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)


44 ఏండ్లుగా ఇది కొనసాగుతూనే ఉన్నదని తెలిపారు. తాను వెనుకబడిన వర్గాల ప్రతినిధినని, బీసీ కార్డును పట్టుకునే బతుకుతున్నానని వెల్లడించారు. 'నేను వెనుకబడిన వర్గాల ప్రతినిధిని. ఒకరి గురించి నేను కామెంట్ చేయను. నాకు ప్రజాబలం ఉంది. చాలా కేసులకే నేను భయపడలేదు. నాకు భయం లేదని ముందు నుంచీ చెబుతూనే ఉన్నా.

**ఎలాంటి గ్రూపు రాజకీయాలతో సంబంధం లేదు..**

నేను బీసీ కార్డు పట్టుకునే బతుకుతున్నా. పేదల సమస్యలు పరిష్కరిస్తాను కాబట్టే జనం నా దగ్గరికి వస్తారు. పనిచేసే వారిపైనే కొందరు రాళ్లు వేస్తారు. నడిచే ఎద్దునే పొడుస్తారు. నేను ఎవరికీ భయపడేది లేదు. నాకు ఎలాంటి గ్రూపు రాజకీయాలతో సంబంధం లేదు. వరంగల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కాంగ్రెస్ వచ్చేలా చూస్తాం. పార్టీ ఎవరికి టికెట్లు ఇచ్చినా గెలిపించే బాధ్యత తీసుకుంటానని మీనాక్షి నటరాజన్‌తో చెప్పా. మా సేవల్ని పార్టీ ఉపయోగించుకోవాలని కోరాం. పార్టీకీ మీ సేవలు అవసరమని మీనాక్షీ చెప్పారు. కాంగ్రెస్ పార్టీని బతికించడమే నా ఉద్దేశం. రాహుల్ గాంధీని ప్రధాని చేయడం నా లక్ష్యం. రేవంత్‌రెడ్డిని ఇంకో పదేండ్లు ముఖ్యమంత్రిగా చూడాలి. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు అండగా నిలుస్తా.' అని మురళి చెప్పారు.

## కల్యాణ్ బాబు నిప్పులు చెరిగాడు

### హరిహర వీరమల్లు ట్రైలర్ పై చిరంజీవి రివ్యూ



**మహా:** మెగాస్టార్ చిరంజీవి తన తమ్ముడు, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న భారీ చిత్రం 'హరిహర వీరమల్లు'పై ప్రశంసల వర్షం కురిపించారు. గురువారం విడుదలైన ఈ సినిమా ట్రైలర్‌ను చూసిన ఆయన, సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని, అభిప్రాయాన్ని పంచుకున్నారు. "వాట్ యాన్ ఎలక్ట్రిఫయింగ్ ట్రైలర్!!" అంటూ తన పోస్ట్‌ను ప్రారంభించిన చిరంజీవి, తమ్ముడిని వెండితెరపై చూసి మురిసిపోయారు. "దాదాపు రెండేళ్ల విరామం తర్వాత కల్యాణ్ బాబు వెండితెరపై నిప్పులు చెరగడం చూడటం ఎంతో ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ ఎనర్జీకి, ట్రైలర్‌లోని అద్భుతమైన విజువల్స్‌కు ఆయన ఫిదా అయ్యారు. కల్యాణ్ బాబు నిప్పులు చెరిగాడు అంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 'హరిహర వీరమల్లు' చిత్ర బృందం మొత్తానికి చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. నిర్మాత ఏఎం రత్నం, దర్శకుడు ఏఎం జ్యోతికృష్ణ, సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, నటీనటులు బాబీ డియోల్, నిధి అగర్వాల్, సత్యరాజ్‌లను ట్యాగ్ చేస్తూ తన అభినందనలు తెలియజేశారు.

## బనకచర్ల వల్ల ఎవరికీ నష్టం లేదు

- కొందరు అనవసరంగా రాజకీయం చేస్తున్నారు
- వృథా నీళ్లు వాడుకోవాలన్నదే మా ఉద్దేశం
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు



**కుప్పం, మహా:** బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదని ఏపీ సీఎం చంద్రబాబు మరోసారి స్పష్టం చేశారు. వందేళ్ల నుంచి గోదావరిలో ఏటా సగటున 2 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి పోతోందన్నారు. వృథా అవుతున్న నీటిని వినియోగించుకునేందుకే బనకచర్ల ప్రాజెక్టు అని తెలిపారు. ఎగువ ఉన్న తెలంగాణ వాళ్లు ప్రాజెక్టులు కట్టుకుంటే తాను ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదని, ఇకపై కూడా చెప్పను అని చెప్పారు. సముద్రంలోకి పోయే నీళ్లను వాడుకుంటే రాష్ట్రాలు బాగుపడతాయని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. కుప్పంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు.

**ఇకపై కూడా అభ్యంతరం చెప్పను..**

'బనకచర్ల ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదు. కొందరు అనవసరంగా రాజకీయం చేస్తున్నారు. వృథా అవుతున్న గోదావరి నీళ్లు వాడుకోవాలన్నదే మా ఉద్దేశం. ఏటా సగటున 2 వేల టీఎంసీల నీళ్లు వృథాగా సముద్రంలోకి పోతున్నాయి. వృథా అవుతున్న నీటిని వినియోగించుకునేందుకే బనకచర్ల ప్రాజెక్టు. ఎగువ ఉన్న తెలంగాణ వాళ్లు ప్రాజెక్టులు కట్టుకుంటే నేను ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు, ఇకపై కూడా అభ్యంతరం చెప్పను. సముద్రంలోకి పోయే నీళ్లను వాడుకుంటే రాష్ట్రాలు బాగుపడతాయి. నీటి సమస్య పరిష్కారమైతే తెలుగు ప్రజలు బాగుంటారు' అని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



## రిజర్వేషన్లు తేల్చాకే ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ రిజర్వేషన్ల సాధన కోసం జులై 17న రైల్ రోకో
- తెలంగాణ నుంచి ఢిల్లీ వెళ్లే ప్రతి రైలును ఆపుతాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, మహా:** బీసీ రిజర్వేషన్ బిల్లు సాధించేందుకు బీజేపీపై ఒత్తిడి తెస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకూడదని కామెంట్స్ చేశారు. ఈ నెల 17న బీసీ రిజర్వేషన్ బిల్లు అమలు కోసం జాగృతి ఆధ్వర్యంలో చేపట్టనున్న రైల్ రోను విజయవంతం చేయాలన్నారు. రైల్ రోకోకు సంబంధించిన పోస్టర్‌ను హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కవిత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని వద్దకు అఖిల పక్షాన్ని తీసుకెళ్తానన్న సీఎం ఇంకా తీసుకెళ్లలేదని విమర్శించారు. జూలై 8 లోపు రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లోని బీసీ నేతలు రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. బీసీ బిల్లు విషయంమై బీజేపీపై ఒత్తిడి తీసుకురావాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకి లేఖ రాస్తున్నామని చెప్పారు. రైల్ రోకో కార్యక్రమానికి వివిధ పార్టీల మద్దతు కూడగట్టామన్నారు.

**పార్లమెంట్‌లో ఎన్నడూ మాట్లాడలేదు..**

బీసీ బిల్లుపై బీజేపీ చొరవ తీసుకోవాలని, ఈ విషయమై ఆ పార్టీ నూతన అధ్యక్షుడు రామచందర్ రావుకు లేఖ రాశామని చెప్పారు. ఆయన చొరవ తీసుకొని బీజేపీ అధ్యక్ష హోదాలో తొలి విజయం నమోదు చేసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్ వస్తున్నారని విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ బీసీల కోసం పార్లమెంట్‌లో ఎన్నడూ మాట్లాడలేదని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా బీజేపీపై ఖర్గే ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన వివరాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ పాత లెక్కలే చెబుతున్నారని విమర్శించారు. గ్రామ పంచాయతీల వారీగా కులగణన వివరాలు బయట పెట్టాలన్నారు. జూలై 17న రైల్ రోకో నిర్వహించి తెలంగాణ నుంచి ఢిల్లీ వెళ్లే ప్రతి రైలును ఆపుతామన్నారు.

## ఏఐసీసీ చీఫ్ ఖర్గే సమావేశంపై పీసీసీ ఫోకస్

- దేశంలోనే తొలిసారి.. గ్రామస్థాయి క్యాడర్‌తో అధ్యక్షుని భేటీ
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సారథ్యంలో సమావేశం
- మీటింగ్ విజయవంతంపై సీఎం రేవంత్ జూమ్ మీటింగ్
- ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మీనాక్షి నటరాజన్
- ఏఐసీసీ అగ్రనేత సభ ప్రతిష్టాత్మకం

**హైదరాబాద్, మహా:** నేడు రాష్ట్ర పర్యటనకు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే వస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ, మండల, బ్లాక్ శాఖల అధ్యక్షులను, ముఖ్య నేతలను పెద్ద ఎత్తున తరలించేందుకు సన్నద్ధమవుతోంది. మూడు నెలల్లోగా స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఇవాళ ఎల్‌బీ స్టేడియంలో జరగబోయే సభకు పార్టీ ప్రతిష్టాత్మకం కానున్నది. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న గ్రామ, మండల, బ్లాక్, జిల్లా శాఖల అధ్యక్షుల సమ్మేళనం రాజకీయ ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి పటిష్టమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయాలని అధిష్ఠానం భావిస్తోంది.

**సభకు 40 వేల మంది..**

ఖర్గే సమావేశంపై పీసీసీ ఫోకస్ పెట్టింది. క్రియాశీలకంగా పనిచేస్తున్న గ్రామ, మండల, జిల్లా అధ్యక్షులు తప్పనిసరిగా హాజరుకావాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశించారు. అయితే సభ నిర్వహణ కోసం ఎల్బీ స్టేడియంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి 500 మంది చొప్పున నేతలను తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని.. ఇప్పటికే ఇంచార్జి మంత్రులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. దీనిపై బుధవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జూమ్ సమావేశం నిర్వహించగా.. ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఇంచార్జ్ మంత్రులు పాల్గొన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణలో కార్యకర్తల సమావేశం జరగనున్నదని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. తెలంగాణ రోల్ మోడల్‌గా మీటింగ్ సక్సెస్ చేద్దామని, సమావేశం విజయవంతం చేయాలని సీఎం పిలుపునిచ్చారు. నేడు గాంధీభవన్‌లో పీఏసీ, పీఈసీ కమిటీలతో సమావేశం ఉంటుందని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. గురువారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఇవాళ సాయంత్రం 4 గంటలకు ఎల్బీ స్టేడియంలో గ్రామాధ్యక్షుల సమ్మేళనం ఉంటుందని, 40 వేల మంది పాల్గొంటారని చెప్పారు. గ్రామ, మండల, జిల్లా ప్రెసిడెంట్లు, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ ముఖ్యనాయకులు పాల్గొంటారన్నారు. సామాజిక, న్యాయ సమరభేరి పేరుతో సభ ఉంటుందని, నియోజకవర్గం నుంచి 500 మంది వస్తారని తెలిపారు. అలాగే నేరుగా గ్రామ అధ్యక్షులతో ఖర్గే మాట్లాడుతారని వివరించారు.

**కవితకు ఆ హక్కు లేదు..**

ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు పీసీసీ చీఫ్ కౌంటర్ ఇచ్చారు. కవిత బీఆర్ఎస్ నాయకురాలిగా ఖర్గేకు లేఖ రాశారా.. లేదా జాగృతి నాయకురాలిగా రాశారా అని ప్రశ్నించారు. గోర్లు, బర్ల పేరుతో దోచుకుంది బీఆర్ఎస్ కదా అంటూ మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు బీసీల గురించి మాట్లాడలేదని నిలదీశారు. బీఆర్ఎస్ పాలనలో ఎంపీగా, ఎమ్మెల్సీగా, జాగృతి నాయకురాలిగా ఉండి ఎక్కడా కూడా మాట్లాడలేదని గుర్తు చేశారు. బీసీల గురించి మాట్లాడే హక్కు కవితకు లేదన్నారు. ఆ రోజు తాము బీసీల గురించి ప్రకటన చేసే సమయంలో కవిత ఎక్కడ ఉన్నారని, లిక్కర్ స్కామ్‌లో అరెస్టై జైల్లో ఉన్నారని చెప్పారు. బీసీల గురించి ఉద్యమాలు చేశారా.. ఎక్కడ చేశారో మరి తనకు తెలీదన్నారు.

## సవాల్‌కు హరీశ్ సిద్ధమా?..

బనకచర్లపై రేవంత్ చేసిన సవాల్‌కు మాజీ మంత్రి హరీశ్ రావు సిద్ధమా అంటూ మహేశ్ కుమార్ అని ప్రశ్నించారు. ఆనాడు ఏపీ ప్రభుత్వ నేతలతో చెట్టా పట్టా వేసుకొని తిరిగింది మీరే కదా అని మండిపడ్డారు. ఏపీ మాజీ మంత్రి రోజా ఇంట్లో చేపల పులుసు తిని నీటి వాటా విషయంలో కాంప్రమైజ్ అయింది మీరు కదా అని నిలదీశారు. బనకచర్ల విషయంలో బీఆర్ఎస్ నేతలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. అలాగే రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ నాయకుడి నియమించలేని స్థితిలో రాష్ట్రంలో బీజేపీ ఉండటం విచారకరమన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి - మాజీ సీఎం కేసీఆర్ మధ్య ఫెఫికాల్ బంధం ఉందని సెటైర్లు వేశారు. మతతత్వ పార్టీతో లౌకిక వాద పార్టీ అయిన కాంగ్రెస్‌కు ఏం సంబంధమన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీ పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు.

ABN తెలుగు
మహా పత్రిక 03
శుక్రవారం, హైదరాబాద్ | 04-07-2025 | జనరల్ వార్తలు | GENERAL NEWS
WWW.MAHAADAILY.COM

# శుభ్‌మన్ గిల్ @269

- డబుల్ సెంచరీతో సత్తాచాటిన కెప్టెన్
- ఇంగ్లండ్‌లో డబుల్ సెంచరీ సాధించిన తొలి భారత కెప్టెన్‌గా రికార్డ్
- 587 పరుగులకు టీమిండియా ఆలౌట్

**స్పోర్ట్స్, మహా:** భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలి డబుల్ సెంచరీతో సత్తాచాటడు. ఇంగ్లండ్‌తో ఎడ్జ్‌బాస్టన్‌లో జరుగుతున్న రెండో టెస్ట్‌లో టీమిండియా భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో 587 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ గిల్ ఎంతో ఓర్పు, సంయమనంతో చూడ చక్కని ఇన్నింగ్స్ ఆడి భారీ స్కోరుకు బాటలు వేశాడు. ఈ క్రమంలో అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. అసలు సిసలైన టెస్ట్ ఇన్నింగ్స్ ఆడిన గిల్ 387 బంతుల్లో 30 ఫోర్లు, మూడు సిక్సలతో 269 పరుగుల భారీ స్కోరు సాధించాడు. టెస్ట్‌ల్లో డబుల్ సెంచరీ సాధించడం గిల్‌కు ఇదే తొలిసారి. ఇంగ్లండ్‌లో డబుల్ సెంచరీ సాధించిన తొలి భారత కెప్టెన్‌గా గిల్ నిలిచాడు. గిల్‌తో పాటు రవీంద్ర జడేజా (89), యశస్వి జైస్వాల్ (87) కీలక పరుగులు చేశారు. చివర్లో వాషింగ్టన్ సుందర్ (42) గిల్‌తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. దీంతో టీమిండియా 151 ఓవర్లలో 587 పరుగులు సాధించింది. ఇంగ్లండ్ బౌలర్లలో స్పిన్నర్ షోయబ్ బషీర్ మూడు వికెట్లు పడగొట్టాడు. క్రిస్ వోక్స్, జాష్ టంగ్ రెండేసి వికెట్లు దక్కించుకున్నారు. బ్రైడన్ కార్స్, బెన్ స్టోక్స్, జో రూట్ ఒక్కో వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించడంతో ఈ మ్యాచ్‌పై భారత్ పట్టు బిగించినట్టే కనిపిస్తోంది. ఇంగ్లండ్ బ్యాటర్లు దీటుగా స్పందిస్తే ఈ మ్యాచ్ డ్రాగా ముగుస్తుంది. భారత్ బౌలర్లు చెలరేగితే టీమిండియా గెలుపు ఖాయం.





# ఆస్పత్రిలో చేరిన కేసీఆర్

- ఆయన వెంట కేటీఆర్, హరీష్, సంతోష్.. కేసీఆర్ ఆరోగ్యంపై హెల్త్ బులిటెన్ విడుదల
- ఆరోగ్యంపై ఆరా తీసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..
- వైద్యులకు ఫోన్

**హైదరాబాద్, మహా :** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ గురువారం తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. ఆయనను కుటుంబ సభ్యులు హుటాహుటిన సోమాజిగూడ యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి ఆసుపత్రి వైద్యుల బృందం హెల్త్ బులిటెన్ విడుదల చేసింది. తీవ్ర జ్వరంతో కేసీఆర్ ఆసుపత్రిలో చేరారని, వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆయనకు షుగర్ లెవెల్స్ అధికంగా పెరిగినట్టు తేలిందన్నారు. అలాగే సోడియం లెవెల్స్ కూడా భారీగా పడిపోయాయని పేర్కొన్నారు. మిగిలిన అన్ని టెస్టులు నార్మల్ గానే వచ్చాయని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపిన వైద్యులు.. క్లోజ్ అబ్జర్వేషన్ లో ఉంచి, చికిత్స అందిస్తున్నట్టు పేర్కొన్నారు. కాగా కేసీఆర్ ఆరోగ్యంపై సీఎం రేవంత్ రెడ్డి ఆసుపత్రి వైద్యులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మరోవైపు కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఉత్తమ్, వెంకట్‌రెడ్డి
# అసమర్థ మంత్రులు

### వాళ్ల పదవులు ఉంటాయో ఊడుతాయో?
### మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి విమర్శలు



**నల్లగొండ, మహా:** నల్లగొండ జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిల పదవులు రానున్న రోజుల్లో ఉంటాయో ఊడుతాయోనని.. ఇప్పటికే ఉన్న ఇన్‌చార్జ్ మంత్రి హోదాలు పీకేశారని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఎద్దేవా చేశారు. నల్లగొండ జిల్లా చండూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో జిల్లా మంత్రులు చేసిన కొత్త పనులు లేవని..బీఆర్ఎస్ చేసిన పనులకే కొత్తగా బోర్డులు పెట్టుకుంటున్నారన్నారు. అసమర్థ మంత్రులుగా వారు మిగిలిపోనున్నారన్నారు. జిల్లాలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బ్రదర్స్ కొత్తగా తెచ్చి వేసిన రోడ్డు లేదని.. చెత్త మాటలు తప్ప చేసింది ఏమి లేదని విమర్శించారు. జిల్లా మంత్రి కోమటిరెడ్డి 15, 20రోజులు అడ్రస్ లేకుండా గాయబ్ అవుతున్నాడన్నారు. నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి నీటి పారుదల, సివిల్ సప్లై శాఖలపై అవగాహన లేదని..కృష్ణా నదితో పాటు గోదావరి జలాలను సైతం ఆంధ్రకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కేసీఆర్‌ను తిట్టడంలోనే పోటి పడుతున్నారు తప్ప..వారికి రాష్ట్ర ప్రయోజనాలు పట్టడం లేదన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రులే మాట్లాడి ఎమ్మెల్యేలను మాట్లాడనివ్వలేదని..దీంతో ఇదేం సమీక్షా అని ఆ పార్టీ ఎమ్మెల్యేలే విమర్శలు చేస్తున్నారని జగదీష్‌రెడ్డి తెలిపారు.

**ప్రభుత్వం బాకీ పడింది..**

కాంగ్రెస్ పాలనలో ఒక్క రూపాయి అభివృద్ధి లేదు కానీ వందలాది కేసులు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో పోలీస్ శాఖ మాత్రమే పని చేస్తుందని..బీఆర్ఎస్ కార్యకర్తలపై అనేక అక్రమ కేసులు పెడుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో వ్యవసాయరంగం దివాళా కు వచ్చిందని..మళ్ళీ బోర్లు వేయాల్సి వస్తుందని జగదీష్ రెడ్డి విమర్శించారు. మళ్లీ ఎరువులు, విత్తనాల కొరత మొదలైందన్నారు. వానాకాలం రైతు భరోసా ఇవ్వలేదని..ఇంకా 17 వేల కోట్లు ప్రభుత్వం బాకీ పడిందని, సన్నవడ్ల బోనస్ బోగస్ అయ్యిందని..రుణమాఫీ అంతే అయిందని విమర్శించారు. కొత్త ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని, బీఆర్ఎస్ ఇచ్చిన వాటికే నియామకాలు ఇచ్చారని..ఉద్యోగస్తుల బదిలీలకు కూడా డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. కమీషన్స్ కోసం బిల్లులు ఆపడం కాంగ్రెస్ నేతలకే చెల్లిందని విమర్శించారు. చండూర్ మున్సిపల్ చైర్మన్ ఇల్లు చిన్న కారణంతో కూల్చి వేశారని..ఇలా కేసులు పెట్టి భయపెట్టి స్థానిక ఎన్నికల్లో ఓట్లు వేయించుకుందాం అనుకుంటున్నారని జగదీష్ రెడ్డి విమర్శించారు.

# అంగన్‌వాడీ హెల్పర్లకు గుడ్‌న్యూస్

### టీచర్లుగా ప్రమోషన్లు పొందే హెల్పర్ల వయోపరిమితి పెంపు
### ప్రమోషన్ గరిష్ట వయస్సు 50 ఏళ్లకు హైక్.. ఈ నిర్ణయంతో 4,322 మందికి లబ్ధి

**హైదరాబాద్, మహా:**

రాష్ట్రంలో పని చేస్తున్న అంగన్‌వాడీ హెల్పర్లకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది.రాష్ట్రంలో గ్రామాల నుంచి పట్టణాలు, నగరాల్లో కూడా పిల్లలకు మధ్యాహ్నం భోజనం పెట్టి అక్షరాలు నేర్పించే అంగన్వాడీ హెల్పర్లకు తెలంగాణ ప్రభుత్వం వయోపరిమితిని పెంచింది. దీనికి సంబంధించిన ఫైలుపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క గురువారం సంతకం చేశారు. దీంతో రాష్ట్రంలో ఉన్న నాలుగు వేల మందికి పైగా అంగన్వాడీ హెల్పర్లకు ప్రయోజనం చేకూరనుంది.

**ఐదేళ్లు ఏజ్ లిమిట్ పెంపు..**

ఇప్పటి వరకు రాష్ట్రంలో అంగన్వాడీల ఉద్యోగంలో ఉండటానికి ఏజ్ లిమిట్ 45 సంవత్సరాల వరకు మాత్రమే ఉండేది. కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కారు 5 ఏళ్లు పెంచి వారికి 50 ఏళ్ల వయసు వరకు ఉద్యోగ భద్రత కల్పించింది. అంగన్వాడీ టీచర్లుగా పదోన్నతి కోసం గరిష్ఠ వయోపరిమితిని పెంచింది. హెల్పర్‌కు ప్రమోషన్ వయసును 45 నుంచి 50 ఏళ్లకు పెంచుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో రాష్ట్రంలోని 4,322 మందికి ప్రయోజనం కలగనుంది.



# త్వరలో సరికొత్త బాలామృతం

### అంగన్వాడీల బలోపేతంపై మహిళా శిశు సంక్షేమ శాఖ దృష్టి
### అంగన్వాడీ సెంటర్లను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి ఆదేశాలతో అంగన్వాడీల బలోపేతంపై మహిళా శిశు సంక్షేమ శాఖ దృష్టి సారించింది. చిన్నారుల్లో పోషకాహారాన్ని మెరుగు పరిచేందుకు మహిళా స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థల సహకారాన్నితీసుకోవాలని నిర్ణయించింది. మహిళా శిశు సంక్షేమ శాఖపై సచివాలయంలో ఆ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా అంగన్వాడి కేంద్రాల బలోపేతం, పోషకార మిషన్, ఉద్యోగ ఖాళీల భర్తీ, కారుణ్య నియమకాలు, అంగన్వాడి సేవల్లో మహిళా స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థలకు భాగస్వామ్యం, చిన్నారుల పోషకాహార మెరుగుదల కోసం అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు.

**అంగన్వాడీ భవనాల నిర్మాణం కోసం..**

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అంగన్వాడీలను బలోపేతం చేసే దిశలో పలు కీలక సూచనలు చేశారు. శిథిలావస్తలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను తక్షణం సమీపంలోని ప్రభుత్వ కార్యాలయాల్లోకి మార్చాలని సూచించారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని నూతన అంగన్వాడీ భవనాల నిర్మాణం కోసం స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. వీలనైంత త్వరగా అంగన్వాడీ సెంటర్లను అందుబాటులోకి తెచ్చేందుకు మొబైల్‌అంగన్వాడీ, కంటేనర్ అంగన్వాడీలను ఏర్పాటు చేయాలని సూచించారు. వీటికి సంబంధించి వెంటనే నిపుణులతో చర్చించి డిజైన్ ను సిద్ధం చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల బలోపేతం కోసం ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకునేందుకు అన్‌లైన్ పోర్టల్ ను అందుబాటులోకి తేవాలని సూచించారు. ఇక అంగన్వాడీ చిన్నారుల్లో పోషకాహర లోపాన్ని తగ్గించే విధంగా కార్యచరణ సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలుజారీ చేశారు. చిన్నారుల్లో పోషకాహర మెరుగుదల పరిశీలించేందుకు ప్రోగ్రెస్ రిపోర్ట్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని పారదోలేందుకు... వారికి అందించే ఆహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా వంద రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సుప్రీం కోర్టు కేసు నేపథ్యంలో అంగన్వాడీల్లో ఖాళీల భర్తీ, కారుణ్య నియామకాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందించే బాలామృతంలో పలు మార్పులు చేశారు. నిపుణుల సిఫార్సు మేరకు పంచదార లేకుండా సరికొత్త బాలమృతం ను టీజీ ఫుడ్స్ సిద్ధం చేయగా మంత్రి సీతక్క రుచి చూసి పలు సూచనలు చేశారు. పిల్లలకు తిపి అనుభూతి కలిగించేలా కర్జూరా పౌడర్ ను మిక్స్ చేయాలని సూచించారు. త్వరలో సరికొత్త బాలామృతంను పంపిణి చేస్తామన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో అల్పాహారం కోసం కిచిడీ మిక్స్, ఉప్మా మిక్స్ లకు సిద్ధం చేశారు. వేడి నీటిలో వేసి మరిగించగానే అల్పాహారం సిద్ధమవుతోంది. కిచిడీ మిక్స్, ఉప్మా మిక్స్ లను టేస్ట్ చేసిన మంత్రి అందులో మార్పులు చేర్పులు చేయాలని సూచించారు. ఈ సమీక్ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సృజన, తెలంగాణ ఫుడ్స్ ఎండీ కే. చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## ఎరువులు అడిగేది
# రబీ సీజన్‌కు
### ముగిసిన సీజన్ కోసం కాదు

- యూరియా సరఫరాలో రాజకీయం చేయట్లేదు
- సమస్యపై స్పందించిన డీకే అరుణకు థ్యాంక్స్
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో నెలకొన్న యూరియా సమస్యపై స్పందించిన బీజేపీ ఎంపీ డీకే అరుణకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రానికి రబీ సీజన్ కోసం 12లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చినట్లు ఎంపీ చెప్పారని, కానీ, ప్రస్తుతం నడుస్తున్నది ఖరీఫ్ సీజన్ అని గుర్తుచేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అడిగేది ముగిసిన రబీ సీజన్ కోసం కాదని, ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కోసం యూరియా కేటాయింపులు సక్రమంగా సరఫరా చేయాలని కోరుతున్నామన్నారు. ఈ మేరకు మంత్రి తుమ్మల ఓ ప్రకటన విడుదల చేశారు. 'యూరియా సరఫరాలో మా ప్రభుత్వం ఎలాంటి రాజకీయం చేయట్లేదు. మాకు రైతుల శ్రేయస్సే ముఖ్యం. అందుకే రాష్ట్రానికి కేటాయించిన రసాయన ఎరువులు, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ నుంచి ఎక్కువగా సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నాం. ఇందుకోసం ఎంపీ డీకే అరుణ కూడా సహకారం అందిస్తారని ఆశిస్తున్నాం. తెలంగాణ రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి రాష్ట్రానికి వాటాగా రావాల్సిన యూరియా తెప్పించాలని కోరుతున్నాం. ఇదే విషయంపై కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు లేఖ రాశాం' అని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

# బీజేపీ అధ్యక్షుడిగా రేపు రామచంద్రరావు బాధ్యతలు




**హైదరాబాద్, మహా:** తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు రేపు పదవీ బాధ్యతలు స్వీకరించబోతున్నారు. శనివారం అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించి.. ఉదయం 10 గంటలకు బీజేపీ స్టేట్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. అనంతరం చార్మినార్ దగ్గర ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారని కమలం పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే, ఇటీవల తెలంగాణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.

# హ్యామ్ రోడ్లను ఫైనల్ చేశాం

- త్వరలోనే టెండర్లు పిలుస్తాం
- సెప్టెంబర్‌లో పనులు మొదలు పెడతాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి
- హ్యామ్ రోడ్ల ప్యాకేజీపై అధికారులతో సమీక్ష

**హైదరాబాద్, మహా:** హ్యామ్ రోడ్లతో రాష్ట్ర రూపురేఖలే మారిపోతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. హ్యామ్ రోడ్లను ఫైనల్ చేశామని, త్వరలోనే టెండర్లు పిలుస్తామని తెలిపారు. గురువారం ఎర్రమంజిల్‌లోని ఆర్అండ్ బీ కార్యాలయంలో హ్యామ్ రోడ్ల ప్యాకేజీపై మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. హ్యామ్ రోడ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి ఆగస్టు నెలాఖరు వరకు అగ్రిమెంట్ పూర్తి చేస్తామన్నారు. సెప్టెంబర్‌లో పనులు మొదలు పెడతామని వెల్లడించారు. ఎనిమిది రాష్ట్రాల్లో హ్యామ్ మోడలల్లో రోడ్ల నిర్మాణం జరుగుతోందని మంత్రి చెప్పారు. గత ప్రభుత్వం 42 బ్రిడ్జిలను అప్రూవల్ లేక వదిలేసిందన్నారు. ఆర్ అండ్ బీలో ఎలాంటి వివాదాలు లేకుండా పోస్టింగ్స్, ప్రమోషన్స్ ఇచ్చామని.. గత ప్రభుత్వం కనీసం ఏఈలను కూడా రిక్రూట్ చేయలేదని విమర్శించారు.



**ఆర్ఆర్ఆర్ మూడేళ్లలో పూర్తి చేస్తాం..**


రోడ్లు వేసేది ప్రజల కోసమని.. తమకు పేరు కోసం కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మూడున్నరేళ్లలో ఆర్అండ్‌బీ ద్వారా 12 వేల కిలోమీటర్ల రోడ్లు పూర్తి చేస్తామని ప్రకటించారు. రోడ్డు ప్రమాదాల మృతుల సంఖ్య తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ ఉందన్నారు. కేంద్ర మంత్రి గడ్కరీ ఆన్ గోయింగ్ పనులకు రూ. 300 కోట్లు విడుదల చేశారన్నారు. ఈ నెలలో గడ్కరీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కలుస్తామని.. ఆర్ఆర్ఆర్‌కు అనుమతులు తెచ్చుకుంటామన్నారు. ఆర్ఆర్ఆర్ మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. కేసీఆర్ ఆర్ అండ్ బీని వదిలేశారని మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఈ సమీక్షలో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంత రావు,ఈఎన్సీటీ జయ భారతి, సీఈలు మోహన్ నాయక్, లక్ష్మణ్, రాజేశ్వర్ రెడ్డి పలువురు ఎస్ఈలు, ఈ.ఈ, ఏ.ఈ తదితరులు ఉన్నారు.

## గ్రూప్ 1 పిటిషన్లపై విచారణ
# నేటికి వాయిదా

**హైదరాబాద్: మహా:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) గ్రూప్1 పిటిషన్లపై విచారణను హైకోర్టు నేటికి వాయిదా వేసింది. తెలుగు మీడియం అభ్యర్థులకు సరైన మార్కులు వేయలేదని పలువురు దాఖలు చేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ తరపున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్య విషయంలో ఎలాంటి తేడా లేదన్నారు. నామినల్ రోల్స్, అభ్యర్థుల వేలిముద్రల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడించినట్లు చెప్పారు. "కోఠిలోని ఓ కేంద్రంలో పరీక్ష రాసిన వారే ఎక్కువ మంది ఎంపికయ్యారనేది అవాస్తవం. అక్కడ ఉన్న రెండు కేంద్రాలలో 1500 మంది అభ్యర్థులు మెయిన్స్ రాశారు. మిగతా పరీక్షా కేంద్రాల్లో రాసిన వాళ్లలో అంతకంటే ఎక్కువ మందే ఎంపికయ్యారు. కోఠిలోని రెండు కేంద్రాలను కేవలం మహిళలకు కేటాయించడంతో సౌకర్యాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నాం. ఉద్యోగానికి ఎంపిక కాని అభ్యర్థులు ఏవేవో అనుమానాలతో పిటిషన్లు దాఖలు చేశారు. వారు చేస్తోన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవు. కేవలం అపోహలు మాత్రమేగ్రూప్ 1కు ఎంపికైన తెలుగు మీడియం అభ్యర్థులు 9.95 శాతం, ఆంగ్ల మాధ్యమం అభ్యర్థులు 89.88 శాతం, ఉర్దూ మాధ్యమంలో 0.1 శాతంగా ఉన్నారు. ఏపీలో రెండేళ్ల క్రితం నిర్వహించిన ఏపీపీఎస్సీ పరీక్షల్లోనూ ఆంగ్ల మాధ్యమ అభ్యర్థులే ఎక్కువగా ఉన్నారు. టీజీపీఎస్సీకి తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమ అభ్యర్థుల పట్ల ఎలాంటి వివక్ష లేదు. అందరికీ నిపుణులు ఎంపిక చేసిన అంశాల ఆధారంగా మార్కులు వేశారు"అని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం..ఎవాల్యుయేటర్‌కు ఏమైనా మార్గదర్శకాలున్నాయా అని ప్రశ్నించింది. టీజీపీఎస్సీ నుంచి వివరాలు తీసుకొని సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని నిరంజన్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. దీంతో విచారణను ఉన్నత న్యాయస్థానం నేటికి వాయిదా వేసింది.


# నాలాలు పొంగొద్దు

### శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలి
### ముప్పు లేకుండా చూడాల్సిన బాధ్యత మనదే.. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



**హైదరాబాద్, మహా:** నాలాలు పొంగకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులకు సూచించారు. నాలాలకు ఉన్న ఆటంకాలన్నీ తొలగితే చాలా వరకు ముంపు సమస్య తలెత్తదన్నారు. వర్షాల వేళ.. నగరంలోని పలు ప్రధాన నాలాలు, ముంపు ఉన్న ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం పరిశీలించారు. నాలా ఆక్రమణలను ప్రత్యక్షంగా చూసి వెంటనే తొలగించడానికి ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాలు పడినప్పుడు మూసీ నదీ పరీవాహకం కంటే.. ఎక్కువ కూకట్‌పల్లి, జీడిమెట్ల నాలాలే ప్రమాదకరంగా మారుతున్నాయని గ్రహించామన్నారు. ఈ రెండు నాలాలు సాఫీగా సాగకపోవడంతో భరత్‌నగర్, మూసాపేట, బాలానగర్, జింకలవాడ, దీన్‌దయాల్‌నగర్, వినాయక్‌నగర్, కల్యాణ్ నగర్ ప్రాంతాలు నీట మునుగుతున్నాయని, ఈ ఏడాది ముప్పు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జీడిమెట్లలోని ఫాక్స్ సాగర్ నుంచి వచ్చే వరద కాలువ ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురై కుంచించుకుపోయిన విషయాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌గారు క్షేత్ర స్థాయిలో పరిశిలించారు. ఫాక్స్ సాగర్ అలుగు కాలువ ఆనవాళ్లే లేకుండా పోయింది. జీడిమెట్ల ప్రాంతంలో ఆ కాలువ 30 మీటర్ల వెడల్పులో ఉంటే.. కల్వర్టుల వద్ద ఉన్న వెడల్పు కాలనీలు, బస్తీలకు వచ్చేసరికి లేకుండా పోయింది. బాలానగర్ జింకలవాడ, దీన్‌దయాల్‌నగర్ కల్వర్టు కింద 22 మీటర్లు వెడల్పుతో ఉన్న నాలా.. బస్తీలకు వచ్చేసరికి 10 మీటర్లకు పరిమితమైంది. వాస్తవానికి 22 మీటర్ల వెడల్పు, నాలకు ఇరువైపులా 9 మీటర్ల చొప్పున బఫర్‌ని కలిపి మొత్తం 40 మీటర్ల వెడల్పుతో ఉండాల్సిన నాలా 10 మీటర్లకు పరిమితమవ్వడంతోనే జీడిమెట్ల నాలా పొడుగునా.. ఫతేనగర్, బాలానగర్ బస్తీలన్నీ నీట మునుగుతున్నాయని గుర్తించారు. వెంటనే జీడిమెట్ల నుంచి వచ్చే ఈ నాలాను డ్రోన్ కెమెరాతో పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. ఫాక్స్‌సాగర్ చెరువు కిందన నాలాలో పోసిన మట్టిని వెంటనే తొలగించాలని హైడ్రా కమిషనర్ ఆదేశించారు.

మహా పత్రిక
ANN తెలుగు
శుక్రవారం, హైదరాబాద్ | 04-07-2025
WWW.MAHAADAILY.COM



# టీకా కారణమా?

ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాల ప్రభావమే కారణం కావొచ్చని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. దీనిపై ఇప్పటికే ఐసీఎంఆర్, ఎయిమ్స్ లాంటి దిగ్గజ ఆరోగ్య సంస్థలు స్పష్టతను ఇచ్చాయి. తాజాగా ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులతో పాటు వ్యాక్సిన్ తయారీ సంస్థ సీరమ్, బయోకాన్ ఎండీ కిరణ్ మజుందార్ సైతం స్పందించారు. కర్ణాటక సీఎం వ్యాఖ్యలను తప్పుబట్టారు. కరోనా కాలంలో అనేక మంది ప్రాణాలను కాపాడాయని వ్యాక్సిన్లను ప్రశంసించారు. "కొవిడ్ టీకాలు చాలా ప్రభావవంతంగా పనిచేశాయి. అనేకమంది ప్రాణాలను కాపాడడంలో కీలకపాత్ర పోషించాయి. కరోనా కాలంలో ప్రాణాలను కాపాడుకునేందుకు వ్యాక్సిన్లతో మాత్రమే సాధ్యం. అందుకే భారీ స్థాయిలో ప్రజలు వ్యాక్సిన్లు వేసుకున్నారు. ఫలితంగా అనేక మంది మరణం నుంచి తప్పించుకున్నారు. ఇటీవలె ఆకస్మిక గుండెపోటు మరణాలకు వ్యాక్సిన్ ప్రభావం ఉందా? అనే కోణంలో అధ్యయనం చేయగా ఎలాంటి సంబంధం లేదని తేలింది." అని ఎయిమ్స్ వైద్యులు కరణ్ మదన్ పేర్కొన్నారు.




# కొవిడ్ వ్యాక్సిన్.. ఆకస్మిక మరణాలపై దుమారం అసలు నిజాలేంటి?

మహా ప్రత్యేకం: కొవిడ్ సమయంలో కోట్లమంది ప్రాణాలను కాపాడిన వ్యాక్సిన్ల పట్ల ప్రజావిశ్వాసాన్ని సడలించేలా వదంతులు వ్యాప్తి చేస్తున్నారు. ఇది టీకాలపై విముఖత పెంచి, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది అని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. కోవిడ్ వ్యాక్సిన్ వల్ల ఆకస్మిక గుండె పోటు మరణాలు సంభవిస్తున్నాయంటూ ప్రచారం ఉధృతంగా సాగుతుంది. అలాంటి వేళ దేశ రాజధాని ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) స్పందించింది. కోవిడ్ మరణాలను తగ్గించడంలో ఈ వ్యాక్సిన్లు ప్రభావంతంగా పని చేశాయని.. ఆ సమయంలో ఇవి కీలక పాత్ర పోషించాయని తెలిపింది. యుక్తవయసువారి ఆకస్మిక మరణాలకు జీవనశైలి, ముందస్తు ఆరోగ్య సమస్యలే కారణం తప్పితే కొవిడ్ వ్యాక్సిన్ కాదని కేంద్ర వైద్యఆరోగ్యశాఖ వెల్లడించింది. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), ఢిల్లీ ఎయిమ్స్ నిర్వహించిన రెండు అధ్యయనాల ద్వారా ఈ విషయం తేలిందని స్పష్టంచేసింది. దేశీయంగా తయారైన కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితంగా, సమర్థంగా పనిచేస్తున్నాయని, తీవ్ర దుష్పరిణామాలు సంభవించిన ఉదంతాలు అత్యంత అరుదుగా కనిపించాయని ఐసీఎంఆర్, జాతీయ రోగ నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) అధ్యయనాలు వెల్లడించినట్లు వివరించింది. ఒక్క హసన్ జిల్లాలో గుండె సంబంధిత సమస్యలతో నెలలో 20 మంది మరణించడాన్ని కొవిడ్ టీకాతో ముడిపెడుతూ కర్ణాటక సీఎం సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో దేశవ్యాప్తంగా దుమారం రేగుతోంది. గతంలోనూ అనేకమంది యుక్తవయసు గలవారు, ప్రముఖులు మరణిస్తుండడంతో ఈ ప్రచారం ఊపందుకుంది.

## కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ స్పష్టత

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ స్పష్టతను ఇచ్చింది. యువత ఆకస్మిక మరణాలకు జీవనశైలి, ముందస్తు ఆరోగ్య సమస్యలే కారణం తప్ప, కొవిడ్ వ్యాక్సిన్ కాదని క్లారిటీ ఇచ్చింది. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), దిల్లీ ఎయిమ్స్ నిర్వహించిన అధ్యయనాల్లో ఈ విషయం తేలిందని వెల్లడించింది. దేశీయంగా తయారైన కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితంగా, సమర్థంగా పనిచేస్తున్నాయన్నారు. తీవ్ర దుష్పరిణామాలు సంభవించిన ఉదంతాలు అత్యంత అరుదుగా కనిపించాయని ఐసీఎంఆర్, జాతీయ రోగ నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) అధ్యయనాలు తేలినట్లు వెల్లడించింది.

## స్పందించిన సీరమ్ ఇన్‌స్టిట్యూట్

కొవిషీల్డ్ వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేసిన సీరమ్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ ఇండియా సంస్థ సైతం ఈ అంశంపై స్పందించింది. భారత ప్రభుత్వానికి చెందిన ఐసిఎంఆర్, ఎయిమ్స్ లాంటి దిగ్గజ ఆరోగ్య సంస్థలు ఈ మరణాలకు సంబంధం లేదని చెప్పినట్లు పేర్కొంది. కేంద్ర ఆరోగ్య శాఖ సహకారంతో సురక్షితంగా, శాస్త్రీయంగా రూపొందించినట్లు తెలిపింది. మరోవైపు సిద్ధరామయ్య వ్యాఖ్యలపై బయోకాన్ చీఫ్ కిరణ్ మంజుదార్ షా స్పందించారు. సిద్ధరామయ్య అనుమానాలను తోసిపుచ్చిన ఆమె, సీఎం వ్యాఖ్యలు తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయని చెప్పారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'భారత్‌లో అభివృద్ధి చేసిన కొవిడ్ 19 వ్యాక్సిన్‌లు అత్యవసర వినియోగ అధికార చట్టం కింద ఆమోదించారు. ఇది ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగానే తయారైంది. ఈ వ్యాక్సిన్‌లపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దు. ఇవి లక్షల మంది ప్రాణాలను రక్షించాయి. ప్రజలపై దుష్పరిణామాలు సంభవించిన కేసులు చాలా అరుదుగా జరిగాయి. ఈ టీకాలపై నిందలు మానేసి దాని అభివృద్ధి వెనక ఉన్న సైన్స్‌ను గుర్తించడం చాలా ముఖ్యం' అని ఆమె రాసుకొచ్చారు.

## కారణాల నిరూపణ పేరుతో అధ్యయనం

'యుక్తవయసువారిలో ఆకస్మిక మరణాలకు కారణాల నిరూపణ' పేరుతో ఐసీఎంఆర్ సహకారంతో ఢిల్లీ ఎయిమ్స్ ప్రస్తుతం రెండో అధ్యయనం చేస్తోంది. ప్రాథమిక అంశాల ప్రకారం గుండెపోటు, లేదా గుండె కండరాలకు రక్తప్రసరణ ఆగిపోయి కండరాలు నశించడం (మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్) ఈ వయోవర్గంలో ఆకస్మిక మరణాలకు దారితీస్తోంది. గత సంవత్సరాలతో పోలిస్తే కారణాల్లో పెద్దగా మార్పులేమీ కనిపించలేదు. జన్యుమార్పులే మరణాలకు కారణమై ఉండొచ్చు. అధ్యయనం పూర్తయ్యాక అంతిమ ఫలితాలు వెల్లడిస్తాం. మరణాల ముప్పును కొవిడ్ వ్యాక్సిన్ పెంచడంలేదని అధ్యయనాలు స్పష్టంచేశాయి. మరణాలను కొవిడ్ వ్యాక్సిన్‌తో ముడిపెట్టడం తప్పుదోవ పట్టించడమేనని నిపుణులు పునరుద్ఘాటిస్తున్నారు. కొవిడ్ సమయంలో కోట్లమంది ప్రాణాలను కాపాడిన వ్యాక్సిన్ల పట్ల ప్రజావిశ్వాసాన్ని సడలించేలా వదంతులు వ్యాప్తి చేస్తున్నారు. ఇది టీకాలపై విముఖత పెంచి, ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడానికి సాక్ష్యాధారిత పరిశోధనల నిర్వహణకు కేంద్రం కట్టుబడి ఉంది'' అని వైద్యఆరోగ్యశాఖ స్పష్టంచేసింది.

## సిద్ధరామయ్య ఏం అన్నారు?

గత నెలలోనే కర్ణాటకలోని హసన్ జిల్లాలో గుండెపోటుతో దాదాపు 20 మందికి పైగా మరణించడంపై సీఎం సిద్ధరామయ్య ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మరణాలకు కచ్చితమైన కారణాన్ని గుర్తించి పరిష్కారాలు కనుగొనేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. డాక్టర్ రవీంద్ర నాథ్ నేతృత్వంలోని కమిటీని పది రోజుల్లో దీనిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కొవిడ్ వ్యాక్సిన్లను ప్రజలకు తొందరపాటుగా ఆమోదించడం, పంపిణీ చేయడం కూడా మరణాలకు కారణం కావొచ్చని అనుమానాన్ని వ్యక్తంచేశారు. ఇటీవల పలు అధ్యయనాలు ఈ వ్యాక్సిన్లతో గుండెపోటు పెరుగుదలకు కారణం అవుతాయని వెల్లడించాయని గుర్తు చేశారు. దీనిపై కూడా సమగ్ర అధ్యయనం చేయాలని కమిటీని ఆదేశించినట్లు చెప్పారు.






## నేటి సభకు కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలి

**ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పిలుపు**

**ఆదిలాబాద్, మహా:** జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హైదరాబాదు ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనానికి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరైవుతారని పేర్కొన్నారు. పార్టీని గ్రామస్థాయిలో సంస్థాగతంగా మరింత బలోపేతం చేసి, ఎలా ముందుకు తీసుకువెళ్లాలి, అందుకు తీసుకోవల్సిన చర్యలపై పార్టీ శ్రేణులకు, ఖర్గే దిశా నిర్దేశం చేయనున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల తీరు తెన్నులపై పార్టీ శ్రేణులతో చర్చించడంతో పాటు, ప్రజా సంక్షేమ పథకాలను ఏ విధంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్న తదితర అంశాలపై పార్టీ శ్రేణులకు సూచనలు, సలహాలు తెలియజేయునట్లు తెలిపారు. ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలోతరలివచ్చి విజయవంతం చేయాలని, ఖర్గే సందేశాన్ని గ్రామాలలోని ప్రజలకు చేరవేయాలని సూచించారు.





## ప్రమాదకరంగా చెట్లు.. తొలగించండి

**మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు**

**బీజేపీ అధ్యక్షులు ముత్యాల మహేందర్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ నుండి ఇబ్రహీంపట్నం వరకు, పెద్ద చెరువు కట్ట కింద ఇరు వైపుల ఉన్న చెట్లు కమ్ముకోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న కారణంగా, ప్రమాదకరంగా ఉన్న ఈ చెట్లను వెంటనే తొలగించాలని, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ బిజేపీ అధ్యక్షులు ముత్యాల మహేందర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డికి వినతిపత్రం అందించడం జరిగింది. అనంతరం మహేందర్ మాట్లాడుతూ... ప్రజల శ్రేయస్సు కొరకై సమస్యలను పరిష్కరించాలని, మున్సిపల్ కమిషనర్ను కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆడెపు రాఘవేంద్ర, బీజేవైఎం జిల్లా నాయకులు అనిల్ విజయ్, రూపక్, బీజేపీ మున్సిపల్ నాయకులు జోర్రిగల అశోక్, ఆకుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 30 వరకు కవ్వాల్ టైగర్ రిజర్వ్ మూసివేత

**కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాజెక్టు క్షేత్ర సంచాలకులు**



**మంచిర్యాల, మహా :** జాతీయ పులుల సంరక్షణ సంస్థ మార్గదర్శకాల ప్రకారం వ్యాధుల వ్యాప్తిని నియంత్రించడంతో పాటు పులుల సంరక్షణ దిశగా సెప్టెంబర్ 30 వరకు కవ్వాల్ టైగర్ రిజర్వ్ మూసివేయడం జరుగుతుందని కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాజెక్టు క్షేత్ర సంచాలకులు, అటవీ సంరక్షణాధికారి ఎస్ శాంతారామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలంలో పులుల ఆవాసాలు, పర్యావరణ వ్యవస్థ, భద్రతా సమస్యలు, పునరుత్పత్తి, వన్యప్రాణుల సంరక్షణ దృష్ట్యా మూసి వేయడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలంలో అటవీ ప్రాంతంలో ఏర్పడే ఇబ్బందులు, వరద ప్రభావం కారణంగా పర్యాటకులు, అటవీ సిబ్బందికి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. పులులు సహా అనేక వన్యప్రాణుల జాతుల సంతానోత్పత్తికి వర్షాకాలం ముఖ్యమైనదని తెలిపారు. కోర్ జోన్ మూసివేత కారణంగా వన్యప్రాణులు పునరుత్పత్తికి, పిల్లలను పోషించుకోవడానికి వీలు ఉంటుందని తెలిపారు. ఇదే సమయంలో దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను మరమ్మత్తు చేయడానికి, రాబోయే పర్యాటక కాలానికి సిద్ధం చేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. అక్టోబర్ 1 నుండి తిరిగి ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. వన్యప్రాణుల ప్రేమికులు, పర్యాటకులు వన్యప్రాణుల సంరక్షణ కొరకు చేపట్టిన మూసివేతకు సహకరించాలని పేర్కొన్నారు.

## పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**ఎనిమిది వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీ రీయంబర్సుమెంట్ పెండింగ్**

**కడ్తాల్ తహసీల్దారికి ఏబీవీపీ వినతి పత్రం**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** పెండింగ్ లో ఉన్న ఎనిమిది వేల కోట్ల స్కాలర్షిప్, ఫీ రీయంబర్సుమెంట్ ను వెంటనే విడుదల చెయ్యాలని కడ్తాల్ తహసీల్దారికి ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. గురువారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కడ్తాల్ శాఖ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న 8 వేల కోట్ల స్కాలర్షిప్ , ఫీ రీయంబర్సుమెంట్ ను వెంటనే విడుదల చెయ్యాలని కడ్తాల్ తహసిల్దార్ ముంతాజ్ కు వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర నాయకులు క్యామ శ్రీకాంత్ మాట్లాడుతూ... గత కొన్ని సంవత్సరాల నుంచి ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్షిప్ లను, ఫీ రేయంబర్సుమెంట్ విడుదల చెయ్యడం లేదు. పేద, మధ్యతరగతి విద్యార్థులు స్కాలర్షిప్, ఫీ రీయంబర్సుమెంట్ పైన ఆధార పడి చదువుకుంటున్నారు. వారికి సకాలంలో స్కాలర్షిప్, ఫీ రీయంబర్సుమెంట్ అందక చదువుకు దూరం అవుతున్నారు. కళాశాలలో ఫీజు కడితేనే పరీక్షలకు అనుమతిస్తున్నారు. ఫీజులు కట్టలేక విద్యార్థులు మానసికంగా కుంగిపోతున్నారు. ఫీజు కట్టని విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదు దానితో వారు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారు. ఇప్పటికి అయినా ప్రభుత్వం మేల్కొని వెంటనే బకాయిలో ఉన్న స్కాలర్షిప్, ఫీ రీయంబర్సుమెంట్ ను వెంటనే విడుదల చెయ్యాలని అన్నారు. లేని పక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. వినతి పత్రం అందించిన వారిలో నగర కార్యదర్శి పవన్ నాయకులు రమేష్, సందీప్, హరీష్ గౌడ్, హేమంత్, విష్ణు పాల్గొన్నారు.

## విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుంది

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :**విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండలం పౌనూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాబోధన, మధ్యాహ్న భోజన సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రతి పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీగోడ, వంటశాల ఇతర అన్ని మౌళిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలని ఆదేశించారు. ఆహారం తయారీ సమయంలో నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులతో పాటు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం సమయంలో పాఠశాల ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని, బడి బయట పిల్లలు, మధ్య బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువు, కొలతలు స్వయంగా పరిశీలించారు. శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి సకాలంలో ఆహారం, అవసరమైన మందులు అందించి సాధారణ స్థితికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శివ్వారం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని, లబ్దిదారులు చేపట్టిన నిర్మాణ దశలకు అనుగుణంగా బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## ఒకసారిగా క్విడ్ కారులో మంటలు

**చాకచక్యంగా ఫైర్ సిలిండర్లతో మంటలను అదుపు చేసిన పెట్రోల్ బంక్ సిబ్బంది**

**రాజేంద్రనగర్ మహా ;** భారత్ పెట్రోల్ పంపు ఆవరణలో కారు అగ్ని ప్రమాదానికి గురైన సంఘటన మైలర్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధి దుర్గా నగర్ చౌరస్తాలో క్విడ్ కారులో పెట్రోల్ పోయించుకొని వెళ్తున్న క్రమంలో పెట్రోల్ పంపు ఆవరణలోనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి విషయాన్ని గమనించిన పెట్రోల్ బంక్ నిర్వాహకులు ఫైర్ సిలిండర్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. షాద్నగర్ నుండి దిల్సుఖ్నగర్ వస్తున్న సుదర్శన్ అనే వ్యక్తి మైలర్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గా నగర్ చౌరస్తా వద్ద భారత్ పెట్రోల్ పంపులో పెట్రోల్ పోయించుకొని వెళ్తున్న క్రమంలో మంటలు చెలరేగినట్లు పోలీసుల తెలిపారు. పక్కనే ఉన్న వాహనదారులు కారులో మంటలను చూసి భయాందోళనకు గురయ్యారు.

## బూత్ లెవెల్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

**బల్దియా కమిషనర్/ రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్ పాయ్**

**అధికారులకు జాతీయ శిక్షణ అవగాహన కార్యక్రమం**




**వరంగల్ మహా;** బూత్ లెవెల్ అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని బల్దియా కమిషనర్/106 వరంగల్ (తూర్పు) నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్ పాయ్ అన్నారు. 106 వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధిలోని బూత్ స్థాయి ఆఫీసర్లకు వరంగల్ ఐ ఎం ఏ హాల్ లో గురువారం ఏర్పాటు చేసిన జాతీయ శిక్షణ అవగాహన కార్యక్రమంలో ఆర్ ఓ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా బూత్ లెవెల్ అధికారులకు ప్రతి రోజు 50 మంది చొప్పున ఓరియంటేషన్ ప్రోగ్రామ్ లు ఏర్పాటు చేయడం జరిగిందని కార్యక్రమంలో భాగంగా ఓటర్ లిస్ట్ లో ఎలాంటి పొరపాట్లు తప్పులు లేకుండా పకడ్బందీగా తయారు చేయడానికి బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఆ ఇంట్లో 18 సం.లు నిండిన యువతి యువకులతో పాటు చనిపోయిన వారు ఎవరైనా ఉంటే వారి వివరాలను నమోదు చేయాలని తప్పులు లేని ఓటరు జాబితా తయారీ లక్ష్యంగా బూత్ లెవెల్ అధికారులు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. అంతేకాకుండా ఓటు నమోదు, తొలగింపు అనునది బి ఎల్ ఓ లు విచారణ తర్వాతే చేపట్టాలని తద్వారా ఎలాంటి తప్పు జరగడానికి ఆస్కారం ఉండదని ఈ సందర్భంగా కమిషనర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్, ఎన్నికల డి టి సుబాన్, మాస్టర్ ట్రేని సందీప్ తో పాటు శిక్షకులు కనకయ్య నాగరాజు పాల్గొన్నారు.

## జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**సిఐటియు నాయకులు సామెల్**



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ కు సమ్మె నోటీసును గురువారం సిఐటియు మండల నాయకులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల నాయకుడు జగ్గల సామెల్ మాట్లాడుతూ జూలై 9న దేశవ్యాప్తంగా సమ్మె జరుగుతుండడంతో మున్సిపల్ కార్మికుల సమస్యలపై కార్మికులకు పర్మినెంట్ చేయాలి ప్రమాద బీమా సౌకర్యం 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు చట్టాలను నిర్విజన్ చేసి 44 చట్టాలను 4 కోడ్ లుగా మార్చి కార్మికులకు మోసం చేసింది అన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి 4 కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపాలిటీ జిల్లా సహాయ కార్యదర్శి డి నాగేష్, మండల మున్సిపల్ కార్మికుల సంఘం అధ్యక్షులు ప్రవీణ్, మండల ఉపాధ్యక్షులు యాదమ్మ, ఇందిరా, దశరథ తదితరులు పాల్గొన్నారు.

## రబ్బర్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం



**రాజేంద్రనగర్, మహా;** నేతాజీ నగర్ కాలనీలో శివం రబ్బర్ ఫ్యాక్టరీలో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం మైలర్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. భారీగా మంటలు చిలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని 3 ఫైర్ ఇంజన్లతో సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. షాక్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. సుమారుగా పది నుంచి 15 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ఘటన స్థలానికి పోలీసులు చేరుకోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్దేవ్ పల్లి డివిజన్ పరిధి దుర్గా నగర్ లోని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నివాసంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సమావేశం గురువారం నిర్వహించారు. లాల్ బహదూర్ స్టేడియంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే శుక్రవారం నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో జరగనున్న కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల సమ్మేళనంను విజయవంతం చేయాలన్నారు.

## ఖర్గే సభను విజయవంతం చేద్దాం

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**



**వరంగల్ మహా;** జూలై 4న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గురువారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల మండలం పట్టణం,నడికూడ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యుల సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో పరిశీలకులుగా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చీట్ల సత్యనారాయణ,రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి మోత్కూరి ధర్మారావు, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు అయిత ప్రకాష్ రెడ్డి తో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూలై 4న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ మండల అధ్యక్షుల ఆత్మీయ సమ్మేళన బహిరంగ సభలో పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. దేశంలోనే తొలిసారిగా గ్రామస్థాయి కాంగ్రెస్ అధ్యక్షులతో ఏఐసిసి అధ్యక్షుడు నేరుగా సమావేశం కానుండడం ఎంతో విశిష్టమైన ఘటనగా అని అన్నారు.సభకు హాజరయ్యే గ్రామ, మండల, నాయకులు సమన్వయంతో ముందుగానే రావాలని సూచించారు.రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## జగన్నాథుని దర్శించుకున్న మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్

**రాజేంద్రనగర్ మహా ;** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని భక్తి కుటీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ స్వామి రథ యాత్ర మొహోత్సవంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించి రథ యాత్రను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షులు కిరణ్ కుమార్, మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, సీనియర్ నాయకులు ముత్యాలు, ప్రభావతి, శ్రీనివాస్, శ్రీపతి, భక్తి కుటీర్ నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ భద్రకాళీ ఆలయ ధర్మకర్తకు ఆర్యవైశ్యుల సత్కారం

**వరంగల్ మహా;** చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ శ్రీ భద్రకాళీ దేవస్థానానికి ధర్మకర్తగా ఇటీవల ప్రభుత్వం నియమించిన ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వరంగల్ అధ్యక్షుడు టీ వీరన్న ను వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఆయన ను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యుల లో సేవాభావం కలిగి సంఘంలో మంచి పేరున్న వీరన్న ను నియమించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షురాలు కావ్య, శ్రీరాం శైలజ, రవ్వ, గీత, తో పాటు ఆర్యవైశ్యులు, తదితరులు పాల్గొన్నారు.



**రేషన్ కార్డ్ ల వెరిఫికేషన్ ప్రక్రియ**

## పకడ్బందీగా నిర్వహించండి

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వరంగల్ మహా;** రేషన్ కార్డ్ ల వెరిఫికేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్లో రేషన్ కార్డ్ వెరిఫికేషన్ అధికారులు, ఆర్ ఐ లు, ఆర్ ఓ లతో రేషన్ కార్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ పురోగతిని కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బల్దియా పరిధి లో వరంగల్ జిల్లా కు సంబంధించి కొత్త రేషన్ కార్డుల కోసం 12,200 దరఖాస్తులు, అలాగే హనుమకొండ జిల్లా కు సంబంధించి 16,700 కొత్త రేషన్ కార్డు ల కోసం దరఖాస్తులు రావడం జరిగిందని, వరంగల్ జిల్లా పరిధిలో ఇప్పటికే 50% వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి అయిందని, మిగతా దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను ఈనెల 10 లోగా పూర్తి చేయాలని, ఇందుకోసం వెరిఫికేషన్ అధికారులు ఉదయం నుండి క్షేత్రస్థాయిలో పని చేయాలని వీటితో సమాంతరంగా ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ ఇవ్వడం తో పాటు రెగ్యులర్ విధులను కూడా నిర్వహించాలని అన్నారు. ఆర్ ఓ లు ఆర్ ఐ లు నిరంతరం ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని ఏవైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే డి ఎస్ డి ఓ సాంకేతిక సిబ్బంది సహకారంతో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, డిప్యూటీ కమిషనర్లు రవీందర్ ప్రసన్న రాణి ఆర్ ఓ లు యూసుఫొద్దీన్ షహజాది బేగం, టి ఎం సి రమేష్ కమ్యూనిటీ ఆర్గనైజర్ లు తదితరులు, పాల్గొన్నారు.

## దొంగిలించబడిన వాహనాలు బాధితులకు అప్పగింత

**హన్మకొండ ట్రాఫిక్ పోలీసులు**




**హన్మకొండ మహా;**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో దొంగిలించబడిన 10 ద్విచక్ర వాహనాలను సంబంధిత బాధితులకు అప్పగించిన హన్మకొండ ట్రాఫిక్ పోలీసులు. హనుమకొండ ట్రాఫిక్పోలీసులు రోజు వారీ వాహన తనిఖీల్లో భాగంగా క్షుణ్ణంగా 2024 డిసెంబర్ నెల నుంచి ఇప్పటివరకు దొంగిలించి నడుపుతున్న 10 మోటార్ సైకిళ్లను రికవరీ చేసి, వాటి అసలు యజమానులకు (బాధితులకు) అప్పగించారు. గురువారం అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ట్రాఫిక్ రాయల ప్రభాకర్ రావు చేతుల మీదుగా భూపాలపల్లి, మహబూబాబాద్, రాజన్నసిరిసిల్ల జిల్లా, గోదావరిఖని, కరీంనగర్ 1టౌన్, తో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో కేసులు నమోదు చేశారు. కాగా ఇందుకు సంబంధించిన 10 ద్విచక్రవాహనాలను ఆయా వాహన యజమానులకు అప్పగించారు. వాహనాల తో పాటు దొరికిన నేరస్తులను సంబంధిత పోలీస్ వారికి అప్పగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ ట్రాఫిక్ ఏసిపి టి సత్యనారాయణ, హన్మకొండ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీతారెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అసంపూర్తిగా చర్లగూడ బ్రిడ్జి పనులు

**బ్రిడ్జిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి**

**లేనిపక్షంలో పోరాటాలకు సిద్ధమని హెచ్చరించారు**

**మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చొక్కంపేట ఆంజనేయులు**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** చర్లగూడ గ్రామ బ్రిడ్జి అసంపూర్తిగా ఉండడంతో గ్రామ ప్రజలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చొక్కంపేట ఆంజనేయులు అన్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చర్లగూడ గ్రామ పరిధిలో, మూడు సంవత్సరాల క్రితం చెర్లగూడ వంతెన, షాబాద్ మెయిన్ రోడ్డు నుండి అస్పల్లిగూడ రోడ్డు, చెర్లగూడ నుండి చెరువు కట్ట వరకు రోడ్డు పనులకు మొత్తానికి కలిపి 9 కోట్ల రూపాయల నిధులు ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది. వంతెన, వివిధ రోడ్ల నిర్మాణాలను కలిపి శంకుస్థాపన చేసి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్న, అప్పటి నుండి ఇప్పటి వరకు 30 % పనులు పూర్తి కాకపోవడంలో జాప్యం ఏమిటో అర్థం కావడం లేదని ఆంజనేయులు అన్నారు. నిధులు పెద్ద మొత్తంలో మంజూరు అయిన్నప్పటికి బ్రిడ్జి మరియు రోడ్ల పనులు ముందుకు సాగడం లేదని, బ్రిడ్జి పనులలో అధికారుల నిర్లక్ష్యం ఉందా, లేకపోతే రాజకీయాల ప్రభావమా అనేది అర్థం కాకుండా ఉన్నదని అన్నారు. వంతెన పనులకు మూడు సంవత్సరాల క్రితం 9 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయినప్పటికీ ఇంత కాలయాపన జరుగడానికి కారణాలు ఏమిటనేది గ్రామస్తులకు అంతు చిక్కడం లేదని అన్నారు. అంతే కాకుండా వర్షాలు కురుస్తున్న సమయంలో గ్రామ ప్రజలకు విద్యార్థులకు, రైతులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాబట్టి ఇప్పటికైనా సంబందించిన అధికారులు స్పందించి చెర్లగూడ వంతెన మరియు రోడ్లకు సంబంధించిన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా గ్రామ ప్రజలందరిని చైతన్యం చేసి బ్రిడ్జి, రోడ్లను పూర్తి చేసేవరకు పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం చేస్తామని ఆంజనేయులు తెలియజేయడం జరుగుతుంది.



## ఎంఇఓకు శుభాకాంక్షలు తెలిపిన వడుప్స వరంగల్ జోన్ కమిటీ

**వరంగల్ మహా;** వడుప్స వరంగల్ జోన్ అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో వరంగల్ మండల నూతన ఎంఈఓ గా బాధ్యతలు స్వీకరించిన ఎం మురళిని గురువారం వారి కార్యాలయంలో కమిటీ సభ్యులందరూ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడుప్స (ట్రస్మా) జిల్లా గౌరవ అధ్యక్షులు ఆడెపు. శ్యామ్, జిల్లా కోశాధికారి ఠాగూర్ జ్ఞానేశ్వర్ సింగ్, ట్రస్మా జిల్లా సలహాదారులు కొడెం శ్రీధర్, పొన్నోజు చక్రపాణి, జిల్లా ప్రతినిధులు ఆడెపు. వెంకటేశ్వరులు,మడిపెల్లి రాజు, ఖిలా వరంగల్ జోన్ అధ్యక్షుడు ముక్కెర. రవీందర్, వడుప్స వరంగల్ జోన్ కోశాధికారి కూరపాటి మోహన్, జోన్ సలహాదారులు కొడిమెల.రవి, వడుప్స జోన్ ప్రతినిధులు నందాల.చందర్ బాబు, వి.విశ్వనాథ్, జి.ప్రవీణ్ కుమార్,డి.నర్సింహాస్వామి, కూచన విశ్వేశ్వర్, కూచన శ్రీనివాస్, తదితర కరెస్పాండెంట్స్ పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్శి షా**



**ఆదిలాబాద్, మహా:** విద్యార్థి దశ నుండే ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించేలా వారికి అవగాహన కల్పించేందుకు ఆరోగ్య పాఠశాల కార్యక్రమం దోహదం చేస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రభుత్వ కళాశాలలు, ఉన్నత పాఠశాలలకే పరిమితమైన ఈ కార్యక్రమం ఈనెల 3 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించమన్నారు. గురువారం రణదీవే నగర్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమ ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం తెలంగాణ గేయాన్ని ఆలపించి ఆరోగ్య పాఠశాల బుక్ లెట్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అదేవిధంగా సెల్ ఫోన్ వినియోగం కారణంగా ఎదురయ్యే నష్టాలను వివరిస్తూ విద్యార్థులు చేసిన నాటిక ఆలోచింపచేసింది. అనంతరం హెల్తీ స్టూడెంట్స్ గా ఎంపికైన వారికి కలెక్టర్ బహుమతులు అందించి అభినందించారు. ఎస్బీఐ ద్వారా సీఎస్ ఆర్ ఫండ్ కింద నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించి... విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్ల ను అందచేశారు. బడితోటలో భాగంగా కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం అయన మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ లో భాగంగా 2047కు గాను ఆదాయ వనరులను త్రీ ట్రిలియన్ కు కసరత్తు సాగుతోందని తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థి దశ నుంచే ఆరోగ్య పరిరక్షణ పై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. గతేడాది ప్రారంభించిన ఈ కార్యక్రమం మంచి ఫలితాలు ఇవ్వడంతో ఈ ఏడాది ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల్లలోనూ అమలు చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఆరోగ్యాంగా ఉంటేనే చదువులో రాణించి ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బుక్ లెట్ ప్రకారం ఉపాధ్యాయులు ఆరోగ్య సూత్రాలు భోదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ సోమయ్య, ఎస్బీఐ ఆర్ఎం రామచంద్ర రావు, చీఫ్ మేనేజర్ కే. సురేష్, శ్రీధర్, ఎల్డీఎం ఉత్పల్ కుమార్, మేనేజర్ బాలకృష్ణ, హెచ్ఎం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసరా అందేదెప్పుడో..?

- ఐదేండ్లుగా కొత్త పింఛన్లకు లభించని మోక్షం
- సర్కారు సాయం కోసం వేలాది మంది ఎదురుచూపులు
- కార్యాలయాలకు వరుస కడుతున్న లబ్ధిదారులు
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా కరుణ చూపాలని వేడుకోలు



**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లా తాంసి మండల కేంద్రానికి చెందిన ఈయన పేరు ఎల్లన్న. 90శాతం వికలాంగత్వం ఉంది. గత నాలుగేళ్ల క్రితం ఆసరా పింఛన్ కోసం దరఖాస్తు చేశారు. కానీ ఇప్పటికీ ఆయనకు మంజూరు కాలేదు. ఇలాంటి అర్హులైన వారు జిల్లాలో అనేక మంది ఉన్నారు. ప్రభుత్వం మారినా కొత్త పింఛన్లకు మోక్షం లభించడం లేదు. గత సర్కారు హయాంలో జరిగిన జాప్యమే తాజాగానూ చోటు చేసుకుంటోంది. ఆసరా పింఛన్ల కోసం అర్హులైన వారు ఎదురుచూస్తుండగా.. ప్రభుత్వం వీటికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదు. ఫలితంగా వయసు పైబడి పింఛన్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్న వేలాది మంది లబ్ధిదారులకు నిరాశే ఎదురవుతోంది. 2019 నుంచి కొత్త పింఛన్ల మంజూరు కాకపోవడంతో ప్రభుత్వం వద్ద అర్హులైన వారి దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. పింఛన్ కోసం దరఖాస్తులు చేసిన వారు రోజువారీగా ప్రభుత్వ కార్యాలయాలకు వరుస కడుతున్నారు. ఇప్పుడు..అప్పుడూ అంటూ అధికారులు దాటవేస్తున్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఆసరా లబ్ధిదారుల పట్ల కరుణ చూపాలని కొత్త పింఛన్ లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

**వేలాది మంది ఎదురుచూపు**

ప్రభుత్వం వద్దులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, చేనేత కార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా ఆసరా పింఛన్లు అందిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 74,159మంది వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారు. వికలాంగులకు రూ.3వేలు అందిస్తుండగా.. మిగితా అందరికీ రూ.2వేల చొప్పున అందజేస్తోంది. గతంలో పింఛన్ వయస్సు 60సంవత్సరాలు ఉండగా గత ప్రభుత్వం ఈ వయస్సును 57 సంవత్సరాలకు కుదించింది. దీంతో అనేక మంది లబ్ధిదారులు వీటి కోసం దరఖాస్తులు చేశారు. 2019 నుంచి కొత్త వాటిని మంజూరు చేయకపోవడంతో ప్రతి ఏటా లబ్ధిదారుల సంఖ్య పెరుగుతూ పోతోంది. 57 సంవత్సరాలు రాగానే పింఛన్ కోసం దరఖాస్తులు అందిస్తున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం మంజూరు చేయడం లేదు. వీటికి తోడు కొంతమంది వికలాంగులుగా మారుతుండటం..సదరం సర్టిఫికేట్ పొందడం..మరికొంత మంది వితంతువులుగా మారిన వారు వీటి కోసం దరఖాస్తులు అందిస్తున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం కొత్త వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఇప్పటి వరకు అధికారిక లెక్కల ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలో 4168మంది దరఖాస్తులు అందించినట్లు చెబుతున్నారు. ఈ సంఖ్య మరింత అదనంగా ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోపక్క ఇటీవల కొందరు వితంతువులకు పింఛన్లు అందించగా.. మిగితా వారిని మాత్రం విస్మరించడం పట్ల ప్రభుత్వం తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైనా కరుణ చూపి మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

**రూ.4వేల పింఛన్ ఊసే లేదు..**

గత ప్రభుత్వం పింఛన్ దారులకు ప్రతి నెలా రూ.2వేల చొప్పున అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆసరా పింఛన్ ను రూ.4వేల చొప్పున అందిస్తామని భరోసా ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పెంచిన పింఛన్ ఊసు లేకుండా పోయింది. ఎప్పటి వరకు అందిస్తారో కూడా అధికారులకు సైతం స్పష్టత లేకుండా పోయింది. ప్రస్తుతం ప్రతి నెలా రూ.2వేల పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం సైతం పెంచిన పింఛన్ కు సంబంధించి ఎలాంటి ప్రకటనలు చేయడం లేదు. దీంతో రూ.4వేల పింఛన్ కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల్లో నిరాశ వ్యక్తమవుతోంది.

## బాధిత కుటుంబానికి గొర్రెల పంపిణీ



**ఆదిలాబాద్, మహా** ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి గ్రామానికి చెందిన సిరిపురే వసంత్ అనే కౌలురైతు కుటుంబానికి రూరల్ డెవలప్మెంట్ సర్వీస్ సొసైటీ సహాయంతో రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న గొర్రెలు పంపిణీ చేశారు. మూడు సంవత్సరాల క్రితం వసంత్ ఆత్మహత్య చేసుకోగా ఆయన కుటుంబానికి జీవనోపాధి కోసం రూ.40వేల విలువ గల గొర్రెలను గురువారం అందజేశారు. గొర్రెల పెంపకం ద్వారా ఆదాయం పొందవచ్చనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో ఆత్మహత్య చేసుకున్న బాధిత రైతుల కుటుంబాలకు గేదెలు, మేకలు,ఆవులు, గొర్రెలు, పిండిగిర్నీ, కుట్టుమిషిన్స్, కిరాణా షాప్ తదితర వాటిని సదరు సంస్థ సాయం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మిత్ర ఫీల్డ్ కో ఆర్డినేటర్ ఆవుల రాకేష్, గణేష్,స్వామి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.




### కుటుంబ సభ్యులందరినీ సమానంగా చూడాలి

**ఆదిలాబాద్, మహా** కుటుంబాలు సంతోషంగా, సాఫీగా సాగాలంటే తల్లితండ్రులు, భార్యను సమానంగా చూడాలని యాపల్ గూడ పోలీసు రిజర్వ్ బెటాలియన్ ఆర్ఎస్ఐ గోపి అన్నారు. బెటాలియన్ శిక్షణలో భాగంగా గురువారం కే.ఆర్.కే కాలనీలోని వృద్ధాశ్రమంలో సామాజిక కార్యక్రమాలను చేపట్టారు. వృద్ధులకు నిత్యావసర సరకులు, పండ్లను పంపిణి చేసి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఐ గోపి మాట్లాడుతూ వయసు పెరుగుతున్న కొద్దీ తల్లిదండ్రుల్లో చిన్నతనం వస్తుందని, వారి వ్యవహారానికి తగినట్లుగా నడుచుకుంటే సమస్యలు ఉండవని పేర్కొన్నారు. తమ ఉద్యోగంలో మూడేళ్ళకు ఒకసారి బదిలీలు ఉంటాయని, అందువల్ల కుటుంబానికి సరైన సమయం కేటాయించలేక పోతున్నట్లు తెలిపారు. వృద్ధాశ్రమానికి తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని, వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్న నిర్వాహకుల పనితీరు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు నరేష్, రమేష్, నవీన్, రమేష్, లింగి వృద్ధాశ్రమం నిర్వహకులు రాకేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**భూపాలపల్లి, మహా :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం భూపాలపల్లి మండలంలోని ఎస్.ఎన్.కొత్తపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇండ్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో మాట్లాడి ఇంటి నిర్మాణం ఎప్పుడు ప్రారంభించారు, ఇప్పటి వరకు ఎంతవరకు పూర్తి చేశారు, ఏవైనా సాంకేతిక లేదా సామగ్రి సంబంధిత సమస్యలున్నాయా?, ఇసుక ఎక్కడి నుండి తెస్తున్నారని అడిగారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేపట్టిన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందజేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇంటి నిర్మాణం పనులను దశలవారీగా పూర్తి చేస్తూసంబంధిత ఫోటోలు, వివరాలను వెబ్సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్మాణం నాణ్యతకు ఎలాంటి రాజీ లేకుండా పని చేయాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన అందించాలి : కలెక్టర్ రాహుల్ శర్మ**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన అందించేందుకు ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. ఎస్.ఎన్.కొత్తపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి పాఠాలు చదివించారు. విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తి పెరిగేలా, అభ్యసనా సామర్థ్యాలు మెరుగయ్యేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం అదనపు సమయం కేటాయించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తక్కువగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్, పిల్లలను చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. 5వ తరగతిలో నలుగురు విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేరిన సందర్భంగా ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో వ్యత్యాసం ఏంటని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచిగా విద్యాబ్యాసం జరుగుతుందని, ఉపాధ్యాయులు మంచిగా పాఠాలు భోదిస్తున్నారని తెలుపుగా విద్యార్థులను అభినందించారు.పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పూర్తి సంఖ్యలో పుస్తకాలు అందేలా చూడాలని సూచించారు. అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, కేంద్రంలో చిన్నారుల నమోదు సంఖ్య, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అంగన్ వాడి టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యం, మాతృ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అంగన్‌వాడి కార్యకర్తలు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఆరోగ్య సమసమాజానికి కృషి చేయాలని సూచించారు. అంగన్ వాడి నుండే బాల్యం బలోపేతం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, డి ఈ ఓ రాజేందర్,ఎంపిడిఓ నాగరాజు,గృహ నిర్మాణ శాఖ ఏఈ రాయలింగు తదితరులు పాల్గొన్నారు.



### రైతులకు సకాలంలో ఎరువుల పంపిణీ చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్శిషా**

**ఆదిలాబాద్, మహా:** రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులను సకాలంలో పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం జైనథ్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)ను సందర్శించారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. ప్రస్తుతం నిల్వ ఉన్న యూరియా, డీఏపీని సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులను ఎల్లప్పుడు సరిపడా నిల్వలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం అక్కడి కస్తూర్బాగాంధీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పూజ తదితరులు ఉన్నారు.

### కృష్ణ ఏజెన్సీ కాంట్రాక్టు రద్దు

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ రిమ్స్ లో కృష్ణ ఏజెన్సీ పై కలెక్టర్ రాజర్షిషా చర్యలకు ఉపక్రమించారు. ఈనెల 14న కలెక్టర్ రిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన సమయంలో గుర్తించిన సమస్యలపై షోకాజ్ నోటీసు జారీ చేశారు. అయినప్పటికీ కాంట్రాక్టర్ విధులలో నిర్లక్ష్యం వహించడం.. ఇటీవల ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆస్పత్రిని తనిఖీ చేసిన సమయంలో పారిశుధ్య నిర్వహణ లోపంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంచార్జి మంత్రి ఆదేశాల మేరకు కృష్ణ ఏజెన్సీ కాంట్రాక్టును రద్దు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

**చెడు వ్యసనాల బారిన పడకుండా, సన్మార్గం వైపు పయనించాలి**

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**



**ఆదిలాబాద్,. మహా:** యువత సన్మార్గం వైపు పయనిస్తూ చెడు వ్యసనాల బారిన పడకుండా ఉండాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం బోథ్ మండలం కౌట బి గ్రామంలో వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాంటీ డ్రగ్ అవేర్నెస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యువతకు, విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొదటగా జిల్లా ఎస్పీకి ఘన స్వాగతం పలికిన విద్యార్థులు, ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న స్థితిగతులు, మండలంలోని యువత, ప్రజలు మొబైల్ ఫోన్ వాడకం వినియోగం ఎక్కువగా జరుగుతున్న వాటిపై జిల్లా ఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. గ్రామంలోని ఎందరో మంది ఉన్నత స్థానాలకు ఎదిగారని వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. యువతకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించి వాటి బారిన పడితే కలిగే అనర్థాలపై వివరించారు. ముఖ్యంగా విద్యార్థినిలకు అండగా షీ టీం బృందం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని ఎలాంటి సహాయ సహకారమైన 871265953 నెంబర్ కి సంప్రదించాలని పేర్కొన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణ పై ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు మెసేజ్ యువర్ ఎస్పీ అనే కార్యక్రమంలో ద్వారా ప్రారంభించబడిన 8712659973 నెంబర్ కి సమాచారం అందించవచ్చని తెలిపారు. యాంటి డ్రగ్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా గెలుపొందిన వారికి ప్రశంస పత్రాలు ప్రధానం చేశారు. వ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, ఎస్సై ప్రవీణ్ కుమార్, గ్రామ పెద్దలు, యువత, చిన్నారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులను నియంత్రించాలి

**ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు రవీందర్**

**భూపాలపల్లి, మహా :** రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ధర్మ సమాజ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు రవీందర్ డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో భూపాలపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్మ సమాజ్ పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టాన్ని చట్టాన్ని అమలు పూర్తిగా అమలు చేయకపోవడంతో ప్రైవేట్ స్కూలు యజమానులు మితిమీరిన ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధిక ఫీజులను అరికట్టాలని, స్కూల్లో యూనిఫామ్స్ బుక్స్ అత్యధిక ధరలకు అమ్మకుండా చూడాలన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో సరియైన వసతులు లేవని, వాటిని గుర్తించి బెస్ట్ అవలేబుల్ స్కీం పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. బెస్ట్ అవలేబుల్ స్కీం పిల్లలకు అనేక రకాల ఇబ్బందులు ఉన్నాయని,ఈ విషయంలోడీఈఓ పూర్తి పర్యవేక్షణ చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వమే ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ స్కూళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని గుర్తు చేశారు.విద్యార్థులకు ఇదంతా చేయాలంటే రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేదని విద్యాశాఖ మంత్రి పదవీ తన దగ్గరే ఉంచుకున్నాడని వెంటనే విద్యాశాఖ మంత్రిని నియంచాలని అన్నారు. విద్య శాఖ సమస్యలు పరిష్కరించని పక్షంలో రాబోయే రోజుల్లో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా రాస్తా రోకో చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిని గౌలిదొడ్డి గురుకుల ఇంటర్ ద్వితీయ సంవత్సరం చెందుతున్న విద్యార్థులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా కోశాధికారి బొజ్జపల్లి మహర్షి, లాపాక అరబిందో, శనిగరపు గణేష్,బోయిని ప్రసాద్ లాపాక శేషి పాల్గొన్నారు.

## యూరియా కోసం ఆందోళన వద్దు

**ఇంచార్జ్ డిఎఓ బాబు**

**కాటారం, మహా:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రైతులు సాగుచేసిన పంటలకు అనుగుణంగా యూరియా కాంప్లెక్స్లు ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏలాంటి కొరతలేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భూపాలపల్లి జిల్లా ఇన్చార్జి వ్యవసాయ అధికారి బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం సీజన్ కు జూన్ నెలలో 300 టన్నులు యూరియా రైతులకు విక్రయించినట్లు, జూలై నెల కోసం కాటారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, డి సి ఎం ఎస్ లకు యూరియా అలాట్ ఇండెంట్ ఇచ్చినట్లు ఇంచార్జ్ డి ఏ ఓ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం సీజన్ కు సరిపడా కాంప్లెక్స్ ఎరువులు మండలంలోని ప్రైవేట్ దుకాణాలలో అందుబాటులో ఉన్నాయని రైతులు యూరియా కోసం ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రైవేట్ డీలర్లు కృత్రిమంగా యూరియా కొరతను సృష్టించవద్దని తెలిపారు.

## వివిధ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

**ప్రకటించిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్ వెల్లడి**

**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంకల్పించారు. అందుకు అనుగుణంగా క్రమ పద్ధతిలో నిధులు మంజూరు చేస్తూ టియుఎఫ్ఐడిసి పథకం కింద వార్డుల వారీగా పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ తదితర కాంగ్రెస్ నాయకులు క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబర్ మాట్లాడుతూ.... సిసి రోడ్లు, అంతర్గత కాలువలు ఎక్కువగా నిర్మాణం చేపడుతుండగా, పార్కుల అభివృద్ధి, ప్రహరీ నిర్మాణం వంటివి కూడా పథకంలో భాగంగా చేపడుతున్నట్లు వివరించారు. అంతేకాకుండా వార్డులవారీగా విద్యుతికరణలో భాగంగా పాత స్తంభాలను తొలగించడం, కొత్త స్తంభాలు అమర్చడం, పాత వైర్లను తొలగించి కొత్త వైర్లు వేయడం వంటివి చేపట్టి లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. ఈనెల 5వ తేదీ నుంచి పనులకు శ్రీకారం చుట్టాలని స్పష్టం చేశారు. పురపాలికను అన్ని విధాల అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతోనే ఎమ్మెల్యే ఈ మేరకు నిధులు మంజూరు చేసినట్లు ఆయన అన్నారు. వివిధ కాలనీల అభివృద్ధి పనులకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఒకటవ వార్డులో మొత్తం తొమ్మిది పనులు మంజూరు కాగా వీటి విలువ కోటి 84 లక్షల 70వేలు. రెండవ వార్డులో సిసి రోడ్లు, అంతర్గత కాలువలకు కలిపి మొత్తం కోటి 25 లక్షల 80వేలు కేటాయించారు. మూడో వార్డులో సిసి రోడ్లు, అంతర్గత కాలువలకు కలిపి మొత్తం ఐదు పనులకు మూడు కోట్ల 71 లక్షల 30వేలు కేటాయించారు. నాలుగో వార్డ్ లో సిసి రోడ్ల కోసం 77.50 లక్షలు కేటాయించారు. ఐదవ వార్డులో సీసీ రోడ్లు, అంతర్గత కాలువలకు కలిపి 90 లక్షల కేటాయించారు. ఆరవ వార్డులో 17 పనులకు సంబంధించి మూడు కోట్ల 12 లక్షల 40 వేలు కేటాయించారు. ఏడవ వార్డులో నాలుగు కోట్ల 84 లక్షల 25 వేలు కేటాయించగా వీటితో సిసి రోడ్లు, అంతర్గత కాలువలు చేపడుతున్నారు.

## బోనమెత్తిన జనం.. గ్రామ దేవతకు మొక్కులు



**కాటారం, మహా:** ఆషాఢమాసం బోనాల సీజన్..ఆది, గురువారం లలో పల్లెల్లో బోనాల సందడి నెలకొంది. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా గురువారం గ్రామాల్లో ఇంట్లో ప్రత్యేక పాత్రల లో వంటలు చేసి బోనం పోశారు. మహిళలు ఈ బోనం ను నెత్తి పైన పెట్టుకొని మంగళ వాయిద్యాలతో ఇంటి నుండి ఊరేగింపుగా గ్రామ దేవత పోచమ్మ గుడికి తరలి వెళ్లారు. పసుపు కుంకుమ పూలతో పూజలు చేసి టెంకాయ కొట్టి బోనం తో నైవేద్యం సమర్పించారు. కోళ్లు, మేకలను మొక్కి కట్ చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మండల కేంద్రమైన కాటారంలో మహిళలు తలపు తలపై బోనం పెట్టుకొని డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామ దేవత పోచమ్మ గుడికి వెళ్లి ప్రదక్షిణాలు చేసి మొక్కులు సమర్పించారు. గ్రామీణ ప్రజలు ఆషాడ మాసంలో గురు, ఆదివారాలలో బోనాల మొక్కులు చెల్లిస్తారు.


## మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్

**మూడు వారాలకు పైగా ప్రజల ఇక్కట్లు.. పైపులైను రిపేరు చేసిన మరుసటి రోజే లీకేజీ**




**కాటారం, మహా :** భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో మూడు వారాలపైగా మిషన్ భగీరథ మంచి నీరు సరఫరా జరుగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాటారం రెవెన్యూ గ్రామానికి నీరు సరఫరా చేసే ప్రధాన పైప్లైన్ పగిలిపోయింది. రిపేరు కోసం జెసిపి తో మట్టిని తీసినపుడు పైప్ లైన్ పూర్తిగా ధ్వంసం అయింది. బుధవారం పైప్లైన్ రిపేర్ చేసినట్టు గ్రామ కార్యదర్శి ప్రకటించారు. వాటర్ ట్యాంక్ నుండి నీటిని వదిలినప్పుడు పైప్ లైన్ రిపేరు చేసిన కనెక్షన్ వద్ద పెద్ద ఎత్తున నీటి లీకేజీ అవుతుండడంతో నీరు సరఫరా జరగలేదు. గ్రామపంచాయతీకి పాలకవర్గం లేకపోవడం, నిధుల కొరత తో సమస్యలు పరిష్కారం కావడం లేదు. పైప్లైన్ రిపేర్ కోసం నిధులు లేవని రిపేర్ చేయించడంలో తీవ్ర జాప్యం చేశారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సొంత మండలమైన కాటారం పంచాయతీకి। మండలానికి స్పెషలాఫీసర్ లేరు. ఇక్కడి సమస్య జిల్లా అధికారులకు తెలిపేవారు కరువయ్యారు. ఇక్కడ స్పెషల్ ఆఫీసర్ గా పని చేసిన డిఆర్డిఓ జిల్లా అధికారి నరేష్ ఇతర జిల్లాకు బదిలీ అయ్యారు కొత్తగా వచ్చిన అధికారికి బాధ్యతలు ఇవ్వలేదు. సుమారు నెలరోజులుగా గడిచిన పరిస్థితుల్లో మార్పు లేదు ఇటీవల మంత్రి శ్రీధర్ బాబు కాటారం మండల కేంద్రంలో పర్యటించినప్పటికీ అధికారులు ఉదాసీనత అలాగే ఉంది. కేంద్రమైన కాటారంలో మంచినీటి సమస్య పరిష్కరించాలని జిల్లా కలెక్టర్కు విన్నవించిన సమస్య తీవ్రతను గుర్తించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గోదావరి నదికి పెరుగుతున్న వరద ఉధృతి



**కాటారం, మహా :** అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల తో గోదావరి, ఉపనది ప్రాణహితకు వరద ఉధృతి పెరుగుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో గల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాలేశ్వరంలోని గోదావరి, ప్రాణహిత నదుల త్రివేణి సంగమ తీరం పుష్కర ఘాట్ లో మెట్లకు కొద్ది దూరంలో వరద ప్రవాహం కొనసాగుతోంది. అంబట్ పల్లిలోని లక్ష్మీ బ్యారేజీలో సాయంత్రం 3 గంటల వరకు 73,400 క్యూసెక్కుల ఇన్ఫ్లో , అవుట్ ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టులోని ఏడవ పిల్లర్లు కృంగిపోయినప్పటి నుండి సుమారు 22 నెలలుగా ప్రాజెక్టు గల 85 గేట్లుఎత్తివేశారు. కాలేశ్వరం ప్రాజెక్టులలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ అన్నారం సుందిళ్ల ప్రాజెక్టులలో నీరు నిల్వ ఉంచడం లేదు. వర్షాకాలంలో వచ్చిన వరద ప్రవాహం దిగువకు వెళుతోంది. తెలంగాణ రాష్ట్రంలోని ఉత్తర జిల్లాల్లో భారీ వర్షాలు లేనప్పటికీ మారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నరికి వరద ఉధృతి రోజురోజుకు పెరుగుతోంది. నేపథ్యంలో మేడిగడ్డ వద్ద గోదావరి నదికి వరద ప్రవాహం పెరుగుతోంది.

# 2025లో లక్షకుపైగా ఉద్యోగాల కోత



ప్రపంచవ్యాప్తంగా టెక్ ఉద్యోగాల కోత కొనసాగుతున్నది. ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, లాభాల క్షీణత, ఏఐ వినియోగం పెరగడం.. వెరసి కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా 2019లో మొదలైన ఈ కోతలు.. ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

ఈ ఏడాది కూడా వందలాది కంపెనీలు.. లక్షలాది మంది ఉద్యోగులను తొలగించాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ లాంటి దిగ్గజ కంపెనీలు విడతల వారీగా లేఆఫ్స్ ప్రకటించాయి. ఖర్చుల తగ్గింపు, కంపెనీల పునర్వ్యవస్థీకరణ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యాప్తి వంటి కారణాలతో ఈ ఏడాది ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా లక్షకు పైగా టెక్ ఉద్యోగాలకు కోత పడింది. దిగ్గజ ఐటీ సంస్థ మైక్రోసాఫ్ట్ కూడా నిన్న వేలాది మందిపై వేటు వేసింది. ప్రధానంగా Xbox, గేమింగ్ యూనిట్లలో 9,100 మంది ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోనున్నారు.

**మైక్రోసాఫ్ట్‌లో 9 వేల మందికి ఉద్వాసన**

వ్యయ నియంత్రణలో భాగంగా సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి భారీగా ఉద్యోగుల తొలగింపును చేపట్టింది. మొత్తం ఉద్యోగుల సంఖ్యలో 4 శాతానికి తక్కువ కాకుండా తొలగించాలని నిర్ణయించింది. దీంతో సుమారు 9 వేల మంది ఉద్యోగాలు కోల్పోనున్నారు. ఈ తొలగింపులు Xbox, గేమింగ్ విభాగాల్లో ఉండనున్నాయి. గత 18 నెలల కాలంలో మైక్రోసాఫ్ట్ చేపట్టనున్న నాలుగో అతిపెద్ద ఉద్యోగాల కోత ఇదే కావొచ్చని టెక్ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, మైక్రోసాఫ్ట్ ఈ ఏడాది మే నెల మధ్యలో వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇక ఈ ఏడాది జనవరి, జూన్ నెలల్లో కూడా పనితీరు ఆధారంగా కొంతమందిని సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. డైనమిక్ మార్కెట్‌లో పోటీదారుగా నిలవడానికి, కంపెనీ పునర్నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవడానికి కోతలు తప్పడం లేదని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. 'మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తున్నాం' అని మైక్రోసాఫ్ట్ తెలిపింది.

**ఇంటెల్‌లో 20 శాతం కోత**

మరోవైపు, చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ తన గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌లో 20 శాతం వరకు కోత విధించేందుకు సిద్ధమవుతోంది. జూలై మధ్యలో ఈ తొలగింపులు ఉండనున్నట్లు తెలిసింది. చిప్ డిజైన్, క్లౌడ్ ఆర్కిటెక్చర్, ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు లేఆఫ్స్‌కు ప్రభావితం కానున్నారు. సమర్థతను పెంచి, చిన్న బృందాలతో వేగంగా పనిచేయడమే తమ లక్ష్యమని కంపెనీ నూతన సీఈవో లిప్‌బు టాన్ పేర్కొన్నారు. అమెజాన్, గూగుల్, మెటా వంటి ఇతర అగ్రశ్రేణి ఐటీ కంపెనీలు కూడా ఇదే బాటలో పయనిస్తున్నాయి. అమెజాన్ తన బుక్స్, కిండిల్ విభాగాలతో పాటు పలు ఇతర టీమ్‌లలో వందమంది వరకూ ఉద్యోగులను తగ్గించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. రానున్న రోజుల్లో మరింత మందిని తొలగించేందుకు అమెజాన్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఖర్చు తగ్గింపు ప్రణాళిలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 14,000 మందిని తగ్గించాలని యోచిస్తోంది. అంటే దాదాపు 13 శాతం అన్నమాట.

**ఐబీఎమ్‌లో 8 వేల మందిపై వేటు..**

టెక్ దిగ్గజం ఐబీఎమ్ కూడా పెద్ద సంఖ్యలో ఉద్యోగులను (IBM Layoffs) తొలగించినట్లు సమాచారం. దాదాపు 8 వేల మంది ఉద్యోగులపై వేటు వేసినట్లు తెలిసింది. లేఆఫ్స్‌కు గురైన వారిలో ఎక్కువ భాగం హెచ్‌ఆర్ విభాగం (HR department) నుంచే ఉన్నట్లు తెలిసింది. ఆటోమేషన్ ప్రచారంలో భాగంగా ఐబీఎమ్ ఇటీవలే హెచ్‌ఆర్ సిబ్బందిలో కొంత భాగాన్ని ఏఐ (AI) వ్యవస్థలతో భర్తీ చేసినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దాదాపు 200 మంది స్థానాలను ఏఐతో భర్తీ చేశారు.

**ఇన్ఫోసిస్‌లోనూ..**

భారత ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ కూడా అంతర్గత పరీక్షలలో ఉత్తీర్ణత సాధించలేకపోయిన 240 మంది ఎంట్రీలెవల్ ఉద్యోగులను తొలగించింది. కొన్ని నెలల క్రితం ఇదే కారణంతో దాదాపు 300 మంది ఫ్రెషర్లను తొలగించడం గమనార్హం. వీరిలో చాలామంది రెండేళ్లకు పైగా నిరీక్షించి 2024 చివర్లో ఉద్యోగంలో చేరినవారే కావడం గమనార్హం. గూగుల్ కూడా తన ఆండ్రాయిడ్, పిక్సెల్, క్రోమ్ విభాగాల్లో వందలాది మందిని తొలగించింది. టిక్‌టాక్ దాని డబ్లిన్ కార్యాలయంలో 300 మందిని (10 శాతం) తొలగించింది. ఇక ఓలా ఎలక్ట్రిక్ కూడా ఐదు నెలల్లో దాదాపు వెయ్యి మందిపై వేటు వేసింది. హెచ్‌పీలో 2 వేల మందిని, సేల్స్‌ఫోర్స్ వెయ్యి మంది ఉద్యోగులపై వేటు వేశాయి. బ్లూ ఆరిజన్ ఇంజినీరింగ్ విభాగంలో వెయ్యి మందిని తొలగించింది. సిమెన్స్ 5,600 మందిపై వేటు వేసింది. టెక్ కంపెనీలు ఒకవైపు ఉద్యోగులను తొలగిస్తున్నప్పటికీ, మరోవైపు ఏఐ సంబంధిత నైపుణ్యాలు ఉన్నవారికి పెద్దపీట వేస్తున్నాయి. చాలా కంపెనీలు ఏఐ, ఆటోమేషన్, మెషిన్ లెర్నింగ్ ఆధారంగా తమ కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరించుకుంటున్నాయి. దీంతో సాధారణ ఉద్యోగాలకు గండిపడుతోందని, ఏఐ ఆధారిత ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# పతంజలిపై కోర్టుకెక్కిన డాబర్ చ్యవన్‌ప్రాశ్..

## ప్రకటనలు నిలిపివేయాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశం..





డాబర్ చ్యవన్‌ప్రాశ్‌కు వ్యతిరేకంగా పతంజలి ఆయుర్వేద్ జారీ చేసిన ప్రకటలన్నింటినీ నిలిపివేయాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కంపెనీ యాడ్స్‌ను ప్రసారం చేయకుండా జస్టిస్ మిని పుష్కర్ణ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తమ కంపెనీ ఉత్పత్తులను పతంజలి కంపెనీ అవమానిస్తోందంటూ డాబర్ కంపెనీ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు విచారణ జరిపిన జడ్జి ప్రకటనలు జారీ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ సందర్భంగా ఆయుర్వేద గ్రంథాల్లో పేర్కొన్నట్లుగా తాము మాత్రమే చ్యవన్‌ప్రాశ్ తయారు చేస్తున్నట్లుగా పతంజలి సంస్థ ప్రకటనల్లో పేర్కొంటుందని.. ఇతర సంస్థలు మాత్రం సరైన ఉత్పత్తులు తయారు చేసే పరిజ్ఞానం లేదని ప్రకటనలో పేర్కొంది.

అయితే, దీనిపై డాబర్ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. కంపెనీ యాడ్స్‌ను నిలిపివేయడంతో పాటు తమ పరువుకు భంగం కలిగించినందుకు రూ.2కోట్ల పరిహారాన్ని సైతం ఇప్పించాలని కోరింది. కేవలం తమ ఉత్పత్తులే సరైనవని పతంజలి కంపెనీ ప్రకటనల్లో క్లెయిమ్ చేరసుకుంటోందని డాబర్ ఆరోపించింది. డాబర్ కంపెనీ తరఫున న్యాయవాదులు జవహర్ లాలా, మేఘనా కుమార్ విచారణకు హాజరయ్యారు. కోర్టు కేసును జులై 14న మరోసారి విచారించనున్నది. ఇదిలా ఉండగా.. తప్పుదారి పట్టించే ప్రకటనల కేసులో ఇప్పటికే బాబా రామ్‌దేవ్ కోర్టుకు క్షమాపణలు చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. కొవిడ్, ఇతర వ్యాధులను నయం చేయడంలో పతంజలి తప్పుడు ప్రచారం చేరస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

తప్పుదారి పట్టించే ప్రకటనలను ఆపేయాలని సుప్రీం కోర్టు పతంజలిని ఆదేశించింది. అయినా, కంపెనీ ప్రమోషన్స్‌ను ఆపకపోవడంతో పంజతలి కంపెనీపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు బాబా రాందేవ్, ఆచార్య బాలకృష్ణను వ్యక్తిగతంగా కోర్టుకు రావాలని ఆదేశించింది. ఆదేశాలు పాటించకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు తప్పవని హెచ్చరించింది. ఆ తర్వాత బాబా రాందేవ్, బాలకృష్ణ క్షమాపణలు చెప్పారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు కేసు విచారణను ముగించింది. ఇదిలా ఉండగా.. హమ్‌దార్ద్ కంపెనీ 'షర్బత్ జిహాద్'పై బాబా రాందేవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయగా.. కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. కంపెనీ ఉత్పత్తులపై ఎలాంటి ప్రకటనలు చేయొద్దని మే ఒకటిన ఢిల్లీ హైకోర్టు యోగా గురువును ఆదేశించింది.

# లాభాల స్వీకరణకు దిగిన మదుపరులు.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. ఉదయం నుంచి మార్కెట్లు లాభాల్లో ట్రేడయినా.. చివరి వరకు కొనసాగించలేకపోయాయి. మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు చివరి సెషన్‌లో నష్టాల్లోకి జారుకున్నాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,540.74 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 83,850.09 గరిష్టానికి పెరిగిన సెన్సెక్స్.. 83,850.09 పాయింట్ల కనిష్టానికి చేరింది. చివరకు 170.22 పాయింట్లు పతనమై.. 83,239.47 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 48.10 పాయింట్లు తగ్గి 25,405.30 వద్ద ముగిసింది. అమెరికా, వియత్నాం వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో ప్రపంచ మార్కెట్‌లో సానుకూల పవనాలతో భారత మార్కెట్లు సైతం లాభాల్లో మొదలయ్యాయి. తొలి అర్ధ భాగంలో నిఫ్టీ 25,600 పాయింట్లకు చేరింది. అయితే, చివరి గంటలో మదుపరుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో ఇంట్రాడేలో వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. అపోలో హాస్పిటల్స్, హీరో మోటోకార్ప్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఓఎన్‌జీసీ, మారుతి సుజుకీ నిఫ్టీలో ప్రధాన లాభాలను ఆర్జించాయి. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్ నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే మెటల్, రియాల్టీ, పీఎస్‌యూ బ్యాంక్, టెలికాం సూచీలు ఒక్కొక్కటి 0.5 శాతం క్షీణించాయి. ఫార్మా, మీడియా, ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్ 0.31 శాతం పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్‌తో కలిపి విస్తృత సూచీలు వరుసగా మూడో సెషన్‌లో క్షీణించాయి. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ రెండురోజుల పతనాన్ని అధిగమించి 0.5 శాతం పెరిగాయి. బీఎస్ఈలో 140కి పైగా స్టాక్‌లు 52 వారాల గరిష్ట స్థాయికి చేరాయి.

## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL

# హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం : ఇజ్రాయెల్ ప్రధాని



గాజాలో 60 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ట్రంప్ ప్రకటన వేళ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కీలక వ్యాఖ్యలు చేశారు. హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తామని వ్యాఖ్యానించారు. 'హమాస్ ఉండదు.. హమస్థాన్ ఉండదు. ఆ సంస్థను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం' అని వ్యాఖ్యానించారు. గాజా అంశంలో తమ ప్రతినిధులు ఇజ్రాయెల్‌తో సుదీర్ఘ చర్చలు చేపట్టారని అధ్యక్షుడు ట్రంప్ తెలిపిన విషయం తెలిసిందే. గాజాలో 60 రోజుల కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించిందని, ఆ సమయంలో అన్ని పార్టీలతో కలిసి యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తామన్నారు. శాంతి ఒప్పందం కోసం ఖతార్, ఈజిప్ట్ తీవ్రంగా ప్రయత్నించాయని, వాళ్లే దీనికి సంబంధించిన తుది ప్రతిపాదన చేస్తారన్నారు. మిడిల్‌ఈస్ట్ మంచి కోసం హమాస్ ఆ ఒప్పందాన్ని అంగీకరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. అయితే, గాజాపై యుద్ధాన్ని పూర్తిగా ఆపేస్తామంటేనే ఒప్పందాన్ని అంగీకరిస్తామని హమాస్ సంస్థ తెలిపింది.


# గాజాపై ఐడీఎఫ్ భీకర దాడులు..

## 82 మంది పాలస్తీనియన్లు మృతి

హమాస్ అంతమే లక్ష్యంగా గాజాపై ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడుతున్నాయి. ఐడీఎఫ్ జరుపుతున్న ఈ దాడుల్లో అనేక మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా గాజాపై ఇజ్రాయెల్ దళాలు గత రాత్రి వరుస వైమానికి దాడులకు పాల్పడ్డారు. పలు చోట్ల కాల్పులు జరిపారు. ఈ దాడుల్లో దాదాపు 82 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. అందులో 38 మంది మానవతా సాయం కోసం ఎదురుచూస్తున్న వారే. ఇక అనేక మంది గాయపడినట్లు పేర్కొంది. గాయపడ్డ వారు ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించింది.

**గాజాలో 58 వేలు దాటిన మృతుల సంఖ్య**

ఇజ్రాయెల్‌హమాస్ మధ్య యుద్ధం అక్టోబర్ 2023లో ప్రారంభమైన విషయం తెలిసిందే. హమాస్ ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాలపై దాడి చేసింది. ఈ దాడుల్లో 1200 మందికిపైగా ఇజ్రాయెల్ పౌరులు మరణించారు. ఆ తర్వాత ఇజ్రాయెల్ ప్రతీకారంలో ఇప్పటివరకు 58 వేలకుపైగా పాలస్తీనియన్లు మరణించారు. గాజాలో పెద్ద సంఖ్యలో జనాభా నిరాశ్రయులయ్యారు. వేలాది మంది ఆకలి బాధలను ఎదుర్కొంటున్నారు.



**గాజాలో 60 రోజుల కాల్పుల విరమణ : ట్రంప్**

గాజా అంశంలో తమ ప్రతినిధులు ఇజ్రాయెల్‌తో సుదీర్ఘ చర్చలు చేపట్టారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపిన విషయం తెలిసిందే. గాజాలో 60 రోజుల కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించిందని, ఆ సమయంలో అన్ని పార్టీలతో కలిసి యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తామన్నారు. శాంతి ఒప్పందం కోసం ఖతార్, ఈజిప్ట్ తీవ్రంగా ప్రయత్నించాయని, వాళ్లే దీనికి సంబంధించిన తుది ప్రతిపాదన చేస్తారన్నారు. మిడిల్‌ఈస్ట్ మంచి కోసం హమాస్ ఆ ఒప్పందాన్ని అంగీకరిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. అయితే, గాజాపై యుద్ధాన్ని పూర్తిగా ఆపేస్తామంటేనే ఒప్పందాన్ని అంగీకరిస్తామని హమాస్ సంస్థ తెలిపింది.

**హమాస్‌ను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం : ఇజ్రాయెల్ ప్రధాని**

గాజాలో 60 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ట్రంప్ ప్రకటన వేళ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కీలక వ్యాఖ్యలు చేశారు. హమాస్ ను పూర్తిగా తుడిచిపెట్టేస్తామని వ్యాఖ్యానించారు. 'హమాస్ ఉండదు.. హమస్థాన్ ఉండదు. ఆ సంస్థను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం' అని వ్యాఖ్యానించారు.

# 170 విమానాలు రద్దు..

## ఇబ్బందుల్లో 30 వేల మంది ప్రయాణికులు




**పారిస్:** ఫ్రాన్స్‌లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది సమ్మె చేస్తున్నారు. దీంతో అక్కడ వందల సంఖ్యలో విమానాలను రద్దు చేశారు. వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ర్యాన్‌ఎయిర్ సంస్థ 170 విమానాలను రద్దు చేసింది. దీంతో 30 వేల మంది ప్రయాణికుల హాలీడే ప్రణాళికలు మార్చుకోవాల్సి వచ్చింది. ఫ్రాన్స్‌కు చెందిన రెండు సంఘాలు రెండు రోజుల ధర్నా చేస్తున్నాయి. ఆ దేశంలోని నాలుగో వంతు విమానాలు గ్రౌండ్ అయ్యాయి. పారిస్, నీస్ విమానాశ్రయాల్లో ఎక్కడిక్కడే విమానాలు నిలిచిపోయాయి. యూనియన్ డిమాండ్లు ఆమోదయోగ్యంగా లేవని ఫ్రాన్స్ రవాణా శాఖ మంత్రి ఫిలిప్ టబరాట్ తెలిపారు. ఎయిర్ ట్రాఫిక్ ఉద్యోగుల సమ్మెపై ర్యాన్‌ఎయిర్ సంస్థ ప్రకటన చేసింది. ఫ్రాన్స్‌కు వచ్చిపోయే విమానాలే కాదు.. బ్రిటన్, ఐర్లాండ్, స్పెయిన్, గ్రీస్‌కు వెళ్లే విమానాలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పేర్కొన్నది.

# చికాగోలో కాల్పుల కలకలం.. నలుగురు మృతి




అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి తుపాకీ పేలింది. చికాగోలోని ఓ నైట్‌క్లబ్‌పై దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా.. అనేక మంది గాయపడ్డారు. చికాగోలోని రివర్ నార్త్ పరిసరాల్లో గల ఆర్టిస్ లాంజ్ నైట్‌క్లబ్ వెలుపల బుధవారం రాత్రి ఈ ఘటన జరిగినట్లు చికాగో పోలీసులు తెలిపారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో నైట్‌క్లబ్ బయట నిలబడి ఉన్న వ్యక్తులపై కాల్పులు జరిపారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. సుమారు 16 మంది గాయపడినట్లు చికాగో పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. కాల్పులకు పాల్పడిన వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఢిల్లీ ఎయిమ్స్ వద్ద అగ్నిప్రమాదం



దేశ రాజధాని ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఢిల్లీ ఎయిమ్స్‌లోని ట్రామా సెంటర్ వద్ద పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడుతున్నాయి. ట్రామా సెంటర్ బయట ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఈ మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది 8 ఫైరింజన్ల సాయంతో మంటలను ఆర్పివేశారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని ఫైర్ సిబ్బంది తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు ఎగసిపడుతున్న వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.




# రాముడిగా రణ్‌బీర్ కపూర్..

సాయిపల్లవి, బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'రామాయణ'. ఈ సినిమాకు దంగల్ సినిమా దర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా.. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నాడు. రణ్‌బీర్ కపూర్ రాముడి పాత్రలో నటిస్తుండగా.. సాయి పల్లవి సీత పాత్రను పోషిస్తుంది. కన్నడ స్టార్ నటుడు యష్ రావణుడి పాత్రలో నటించబోతున్నాడు. రెండు పార్టులుగా రాబోతున్న ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.

ముల్లోకాలను త్రిమూర్తులు (బ్రహ్మ, విష్ణువు, శివుడు) పరిపాలిస్తున్నారు. బ్రహ్మ అందరిని సృష్టిస్తే.. విష్ణువు రక్షిస్తాడు. శివుడు అంతం చేయగలిగే వాడు. అయితే, వారు సృష్టించిన ఈ మూడు లోకాలపై ఆధిపత్యం కోసం వారు ఎదురు తిరిగినప్పుడు, అన్ని యుద్ధాలను అంతం చేసే ఒక మహాయుద్ధం మొదలైంది. 5 వేల సంవత్సరాలుగా, 2500 కోట్ల మంది ప్రజలు ఆరాధించేది ఇదే. రామాయణం మన వాస్తవం, మన చరిత్ర అంటూ గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్, కైకేయి పాత్రలో లారా దత్తా నటిస్తుండగా.. లక్ష్మణుడి పాత్రలో రవి దూబే నటించబోతున్నాడు.

# అమరన్ డైరెక్టర్‌తో ప్రభాస్ కొత్త మూవీ?

హీరో ప్రభాస్, 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి కాంబినేషన్‌లో ఓ సినిమాకు సన్నాహాలు మొదలయ్యాయనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ప్రభాస్‌ను కలిసి రాజ్‌కుమార్ ఓ కథ వినిపించారని, అది నచ్చి ప్రభాస్ సినిమా చేయడానికి ఆసక్తి కనబర్చారని భోగట్టా. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మించనుందట. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో నాలుగు సినిమాలు ఉన్నాయి. ఇటు రాజ్‌కుమార్ కూడా ధనుష్‌తో ఓ సినిమా చేయాల్సి ఉంది. ఈ ఇద్దరూ తమ కమిట్‌మెంట్స్ పూర్తి చేశాకే ఈ హీరో–దర్శకుడి కాంబినేషన్ గురించి ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ఇకపోతే ప్రభాస్ చేతిలో ది రాజా సాబ్, ఫౌజీ, సలార్ 2, స్పిరిట్ చిత్రాలున్నాయి. ఇందులో ది రాజాసాబ్ డిసెంబర్ 5న విడుదల కానుంది.





# 'చెప్పిన ప్లేస్‌కు రా.. లేదంటే ఆన్‌లైన్‌లో అయినా ఓకే'..

సినిమా అవకాశాల కోసం వెళ్తే చేదు అనుభవాలు ఎదుర్కొన్న నటీనటులు ఎందరో! అయితే సినిమాలే కాదని ఓటీటీలో ఛాన్సులు కావాలంటే కూడా పిచ్చి కండీషన్లు పెడుతున్నారని చెప్తున్నారు నటి హెల్లీ షా. తనకు ఓ వెబ్ సిరీస్‌లో ఆఫర్ వచ్చిందట.. కానీ వాళ్లు చెప్పిన కండీషన్‌కు ఓకే అంటేనే ఎంపిక చేస్తామని మెలిక పెట్టారట! ఈ విషయం గురించి హెల్లీ షా మాట్లాడుతూ.. గతంలో నాకు పెద్ద వెబ్ సిరీస్‌లో భాగమయ్యే ఛాన్స్ వచ్చింది. ఆ ప్రాజెక్ట్ కోసం నన్ను సంప్రదిస్తూ ఓ మెసేజ్ వచ్చింది.

**కండీషన్‌కు ఒప్పుకుంటే..**

అది చూడగానే.. నేను మీ ప్రాజెక్టులో భాగం కావాలనుకుంటున్నారా? అని కన్ఫర్మేషన్ కోసం అడిగాను. అందుకు అవతలివైపు నుంచి అవును, అందుకోసమే మీకు మెసేజ్ చేశాం అని రిప్లై వచ్చింది. నేను చాలా సంతోషించాను. కానీ అంతలోనే.. ఓ కండీషన్.. మేము చెప్పిన ప్రదేశానికి వచ్చి చెప్పినట్లు చేయాలి. అందుకు ఓకే అంటే ఈ ప్రాజెక్ట్ మీ మీ సొంతం అన్నారు. నా వల్ల కాదు, మీరు వేరే ఎవర్నైనా చూసుకోండి అని రిప్లై ఇచ్చాను.

**ఆన్‌లైన్‌లో అయినా ఓకే**

అప్పటికీ అవతలి వ్యక్తి ఊరుకోలేదు. పర్లేదు, మీరు రాకపోయినా సరే, ఫోన్‌లోనే నేను చెప్పింది చేయండి. ఆన్‌లైన్‌లో అయినా నాకేం పర్లేదని బదులిచ్చాడు. అతడు అన్న మాటల్ని నా నోటితో ఎలా చెప్పాలో కూడా తెలియట్లేదు. ఆన్‌లైన్‌లో కాంప్రమైజ్ అడిగాడు. ఈ సోదంతా నాకెందుకు అని అతడి నెంబర్ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాను. ఇలాంటివి ఇంకా జరుగుతూనే ఉన్నాయి. సిగ్గులేని జనాలు మారరు. కొంచెమైనా పద్ధతిగా ప్రవర్తించరు. ఇలాంటి మనుషులతో నాకెందుకు అని ఆ వెబ్ సిరీస్‌ను వదిలేసుకున్నాను అని చెప్పుకొచ్చారు.

**సీరియల్స్- సినిమా**

హెల్లీ షా ప్రస్తుతం గుజరాతీ మూవీ దేద చేస్తున్నారు. ఇందులో హెల్లీ గర్భవతిగా కనిపించనున్నారు. ఈ మూవీ జూలై 4న విడుదలవుతోంది. ఇకపోతే హెల్లీ షా.. అలక్ష్మి: హమారీ సూపర్ బహు, ఖేల్తీ హై జిందగీ ఆంఖ్ మిచోలి, దేవాన్షి, స్వరాగిని జోడైన్ రిష్తో కే సుర్, ఇష్క్ మే మర్జావాన్ 2: నయా సఫర్ వంటి పలు సీరియల్స్ చేశారు. గుల్లక్, పిరమిడ్ వంటి వెబ్ సిరీస్‌లలోనూ మెరిశారు.

# సినిమానే వదిలేస్తా కానీ..తెరపై ఆ పని చేయలేను : రష్మిక

రష్మిక మందన్నా.. ఈ పేరు ఇప్పుడు కుర్రకారుకు తారక మంత్రంగా మారింది. కన్నడంలో ఒక మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన ఈ భామ ఇప్పుడు జాతీయ స్థాయి క్రష్ హీరోయిన్‌గా మారారు. కన్నడ చిత్ర పరిశ్రమలో నటిగా పయనాన్ని మొదలెట్టినా, ఈమెను క్రేజీ హీరోయిన్‌ను చేసింది మాత్రం తెలుగు చిత్ర పరిశ్రమనే అనేది ఎవరూ కాదనలేని నిజం. అక్కడ ఛలో చిత్రంతో కెరీర్‌ను ప్రారంభించి ఇటీవల విడుదలయిన కుబేర వరకూ పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి అగ్ర కథానాయకిగా రాణిస్తున్నారు. అదే విధంగా తమిళంలోనూ సుల్తాన్, వారిసు చిత్రాల్లో మెరిశారు. ఇకపోతే గుడ్‌బై అంటూ బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన రష్మిక మందన్నా అక్కడ తొలి చిత్రం యావరేజ్ అనిపించుకున్నా, ఆ తరువాత నటించిన యానిమల్ చిత్రం సూపర్‌హిట్ అయ్యింది. రణ్‌బీర్ కపూర్‌కు జంటగా నటించిన యానిమల్ చిత్రం గత 2023 డిశంబర్ నెలలో తెరపైకి వచ్చి రక రకాల విమర్శనలను ఎదుర్కొంది. ముఖ్యంగా నటుడు రణ్‌బీర్ కపూర్ పాత్రపై మాత్రం ఘోరంగా విమర్శలు ట్రోల్ అయ్యాయి. ఆయన ఎక్కువగా సిగరెట్స్ కాల్చే సన్నివేశాలపై తీవ్ర విమర్శలు దొర్లాయి. అయితే వసూళ్లను మాత్రం రికార్డు స్థాయిలో రాబట్టుకుంది. దీని గురించి ఇటీవల ఒక భేటీలో స్పందించిన నటి రష్మిక మందన్నా తాను ఆ చిత్రాన్ని చిత్రంగానే చూశానన్నారు. చిత్రంలో హీరో సిగరెట్టు తాగితే అది ఇతరులను సిగరెట్లు తాగే విధంగా ప్రేరేపిస్తున్నాయి అని అంటున్నారని, సమాజంలో ప్రజలు సిగరెట్స్ తాగడం అనేది సర్వ సాధారణం అని పేర్కొన్నారు.

అయితే తాను మాత్రం సినిమాల్లో కూడా సిగరెట్స్ తాగే విధంగా నటించనని చెప్పారు. ఒకవేళ అలాంటి పాత్రలు వస్తే.. సినిమానే వదిలేస్తానని అన్నారు. ఇకపోతే చిత్రాన్ని చిత్రంగానే చూడమని, ఇతరులను చిత్రం చూడమని ఎవరినీ చిత్రం చూడమని వత్తిడి చేయడం లేదని అన్నారు. ఇక్కొక్కరికి ఒక్కో చెడ్డ అలవాటు ఉంటుందని దాన్ని యానిమల్ చిత్రంలో దర్శకుడు చూపించారు అంతే అని నటి రష్మిక మందన్నా పేర్కొన్నారు. అయితే చిత్రం విడుదలై ఏడాదిన్నర పైగా అయినా యానిమల్ చిత్రం విమర్శల నుంచి తప్పించుకోలేకపోతోంది.



# అది నా ఫార్ములా కాదు..

## నిర్మాత దిల్ రాజు



''ఓ నిర్మాతకు ఓ హీరోతో సినిమా కమిట్‌మెంట్ కావాలంటే అబ్‌నార్మల్ అడ్వాన్స్‌లు ఇచ్చి, వాళ్లను హోల్డ్ చేసుకుని సినిమా ప్లాన్ చేయాలి. అది నా ఫార్ములా కాదు. హీరోలకు, దర్శకులకు అడ్వాన్స్‌ల రూపంలో డబ్బులిచ్చి, వారిని కట్టడి చేయడం అనే దానికి నేను వ్యతిరేకం. ఓ దర్శకుడితో నాకు వేవ్ లెంగ్త్ సింక్ అయితే సినిమా చేస్తాను'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన చిత్రం 'తమ్ముడు'. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమీ గౌడ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో 'దిల్' రాజు పంచుకున్న విశేషాలు. కథగా చూస్తే 'తమ్ముడు' సింపుల్ స్టోరీ. అక్కా తమ్ముడి మధ్య ఓ సమస్య రావడం, వారు ఆ సమస్యను సాల్వ్ చేసుకోవడానికి ఎలాంటి ప్రయత్నం చేశారు? అనేది మూవీలో చూస్తారు. స్క్రీన్‌ప్లే పరంగా కొత్తగా చూపిస్తూ, యాక్షన్ సీక్వెన్స్‌లతో ఆసక్తికరంగా తీశాడు వేణు శ్రీరామ్. ఇది యాక్షన్ ప్యాక్డ్ సినిమా. మొదటి ఇరవై నిమిషాల తర్వాత ఈ సినిమాలోని మిగిలిన కథంతా ఒక్క రోజులో జరుగుతుంది. మా బ్యానర్‌లోని గత సినిమాలు అమెజాన్‌లో స్ట్రీమింగ్ అయ్యాయి. కానీ ఒకరితోనే ముందుకు వెళ్లలేం కదా. సో... 'తమ్ముడు' సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. ఇక థియేటర్‌లో సినిమా ప్రదర్శనకు ముందు ఆ సినిమా ఏ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుందో తెలిసేలా ఉండటం కరెక్ట్ కాదు. ఈ విషయం గురించి ఓటీటీ సంస్థలతో మాట్లాడినప్పుడు సపోర్ట్ చేస్తామన్నారు. ఎఫ్‌డీసీ నుంచి గద్దర్ అవార్డ్స్ వేడుక చేశాం. అలాగే మన హైదరాబాద్‌లో ఆగిపోయిన చిల్డ్రన్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను ఈ ఏడాది ఎఫ్‌డీసీ ద్వారా నిర్వహించాలని అనుకుంటున్నాం. ఆన్‌లైన్ టికెటింగ్, రన్‌ట్రాక్ (సినిమా వసూళ్లను ట్రాక్ చేసే విధానం) లను తెలంగాణాలో తీసుకువచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. మా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, దిల్‌రాజు ప్రొడక్షన్స్ సంస్థల్లో ఈ ఏడాది నాలుగు సినిమాలు (రౌడీ జనార్ధన, ఎల్లమ్మ, దేత్తడి, మరో సినిమా స్క్రిప్ట్ స్టేజ్‌లో ఉంది) రెడీ అవుతున్నాయి. ఇంకా అనిల్ రావిపూడితో ఓ సినిమా, 'మార్కో' హనీఫ్‌తో ఓ సినిమా, ఓ ఇద్దరు కొత్త డైరెక్టర్స్ సినిమాలు ఉన్నాయి. ఇంకా ఓ అడ్వెంచరస్ సినిమా కూడా ఉంది. ప్రశాంత్ నీల్‌తో సినిమా ఉంటుంది. హోల్డ్‌లో ఉన్న 'సెల్ఫిష్' సినిమాపై ఈ వారంలో ఓ కార్లిటీ వస్తుంది. కొత్తవారిని ప్రోత్సహించే విధంగా 'దిల్' రాజు డ్రీమ్స్‌లో కొన్ని ప్రాజెక్ట్స్ గురించి చర్చలు జరుగుతున్నాయి. 'దిల్' రాజు డ్రీమ్స్‌లో నిర్మాతలు కూడా దరఖాస్తు చేసు కుంటున్నారు. కథ బాగుంటే మేమే బడ్జెట్ కేటాయించి వాళ్లతో సినిమా చేస్తాం. వాళ్లు సినిమా చేసుకుని మా దగ్గరకు వస్తే మా గైడెన్స్‌తో ఆ సినిమాను రిలీజ్ చేస్తాం. ఇక పైరసీని అరికట్టేందుకు ఇండస్ట్రీ నుంచి గట్టి చర్యలు తీసుకుంటున్నాం.

# దీపికా పదుకొణెకు అరుదైన గౌరవం..

## తొలి ఇండియన్‌గా రికార్డు

బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొణెకు అరుదైన గౌరవం దక్కింది. 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ 2026'కు ఆమె ఎంపికయ్యారు. ఈ విషయాన్ని తాజాగా హాలీవుడ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధికారికంగా వెల్లడించింది. వినోదరంగంలో గణనీయంగా కృషి చేసినందుకుగాను ప్రతి ఏటా హాలీవుడ్ ఫిల్మ్ చాంబర్ 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్ ' జాబితాను వెల్లడిస్తుంది. ఈ ఏడాది మోషన్ పిక్చర్స్ విభాగంలో దీపికను ఎంపిక చేసినట్లు హాలీవుడ్ చాంబర్ ఆఫ్ కామర్స్ వెల్లడించింది.

ఈ జాబితాలో డెమి మూర్, రాచెల్ మెక్‌ఆడమ్స్, ఎమిలీ బ్లంట్ వంటి హాలీవుడ్ తారలతో పాటు మొత్తం 35 మంది ఉన్నారు. భారత్ నుంచి 'హాలీవుడ్ వాక్ ఆఫ్ ఫేమ్ స్టార్' గౌరవం దక్కించుకున్న తొలి నటిగా దీపిక చరిత్ర సృష్టించింది. బాలీవుడ్ అగ్రతారలు అయిన షారుఖ్ ఖాన్, అమీర్ ఖాన్, సల్మాన్ ఖాన్ కూడా ఈ జాబితాలో స్థానం పొందలేకపోవడం గమనార్హం.

2006లో ఉపేంద్ర హీరోగా నటించిన కన్నడ సినిమా ఐశ్వర్యతో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టింది దీపిక. ఆ తర్వాత షారుఖ్ ఖాన్ నటించిన బాలీవుడ్ మూవీ ఓం శాంతి ఓం తో మంచి గుర్తింపు సంపాదించుంది. 2017లో త్రిబుల్ ఎక్స్: ది రిటర్న్ ఆఫ్ జాండర్ కేజ్' సినిమాలో హాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. కల్కి 2898 ఏడీ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ప్రస్తుతం అల్లు అర్జున్ -అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com